వైభవంగా మార్కండేయ జయంత్యుత్సవాలు 8లో..

విద్యార్థులు అధైర్యపడవద్దు కలెక్టర్ షేక్ యాస్మిన్ బాషా 8లో..



జగిత్యాలలో ఆందోళన చేస్తున్న ఆశా వర్కర్లు

సమస్యలు పరిష్కారమయ్యేదెన్నడు..?

- నెలకు రూ. 18 వేలు ఫిక్స్‌డ్ వేతనం చెల్లించాలని ఆశా వర్కర్ల పోరాటం
- అమలుకు నోచుకోని హామీలు
- ఆందోళన బాట పట్టిన ఆశా వర్కర్లు

జగిత్యాల, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఆశా వర్కర్లు సమస్యలతో సతమతమవుతున్నారు. గ్రామాల్లో వివిధ వైద్య సేవల పథకాల అమల్లో కీలకపాత్ర పోషిస్తున్న ఆశా వర్కర్లపై ప్రభుత్వం చిన్నచూపు చూస్తోంది. కనీస వేతనం పెంపు సహా పలు సమస్యలు పరిష్కరించాలంటూ సుమారు వంద రోజులు పైనా గతంలో సమ్మె చేసిన సందర్భంగా ఇచ్చిన హామీలు అమలు కాకపోవడంతో నిరుత్సాహానికి గురవుతున్నారు. ఎప్పటికప్పుడు పారితోషకాలు అందకపోవడంతో ఆర్థికంగా ఇబ్బందులకు గురవుతున్నారు.

ప్రభుత్వ పథకాల పేరిట వీరికి అనేక పనులు అప్పస్తున్నారని వాపోతున్నారు. ఏ నెలకు ఆ నెల పారితోషికాలు అందించడంతో పాటు ఇతర సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఆందోళనలు జరుపుతున్నారు. ఇటీవల జిల్లా కేంద్రంలోని సమీకృత కలెక్టరేట్ కార్యాలయం వద్ద బైఠాయించి ధర్నా చేశారు. కలెక్టరేట్ కార్యాలయంలో అధికారులకు వినతి పత్రం సమర్పించారు. అధికారులు తమ సమస్యలను పరిష్కరించకుంటే ప్రణాళికబద్ధంగా ఆందోళనలను నిర్వహించడానికి సిద్ధమవుతామని స్పష్టం చేశారు.

జిల్లాలో సుమారు 700 ఆశా వర్కర్లు...

జిల్లా వ్యాప్తంగా ఆయా ప్రాంతాల్లో గల సుమారు 700 మంది ఆశా వర్కర్లు పనిచేస్తున్నారు. జగిత్యాల ఏరియా ఆసుపత్రితో పాటు కోరుట్ల, మెట్‌పల్లి, ధర్మపురి, రాయికల్‌లలో గల వైద్య విధాన పరిషత్ ఆసుపత్రులు, మండల కేంద్రాలు, ఇతర ప్రాంతాల్లో గల ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, ఉప ఆరోగ్య కేంద్రాల పరిధిలో ఆశా వర్కర్లు వివిధ ఆరోగ్య కార్యక్రమాల విధులను నిర్వర్తిస్తున్నారు.

పల్లెల్లో ఆశాల సేవలు కీలకం...

జాతీయ ఆరోగ్య మిషన్ మార్గదర్శకాల ప్రకారం సుమారు పదేళ్ల క్రితం నియమితులైన ఆశా వర్కర్లు కుటుంబ నియంత్రణ, ఆసుపత్రుల్లో కాన్పులు, టీకాలు వంటి వైద్య సేవలతో పాటు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ వైద్య ఆరోగ్య కార్యక్రమాలను జయప్రదం చేయడంలో కీలక పాత్ర వహిస్తున్నారు. అదేవిధంగా 104, 108, ఆరోగ్య శ్రీ పథకాలకు సహకరిస్తున్నారు. హెచ్ఐవీ రోగులకు అవసరమైన సేవలు చేయడం, కుష్టు, టీబీ రోగులకు మందుల పంపిణీ చేయడం, ఇంటింటికీ వెళ్లి ప్రజలకు వచ్చే వ్యాధులపై పలు సందర్భాల్లో సర్వేలు చేయడం, ఉన్నతాధికారులకు నివేదికలు ఇవ్వడం వంటి పనులు నిర్వరిస్తున్నారు. అవసరమైన రోగులను ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలకు తీసుకవెళ్లడం, అక్కడ వైద్యం లభించకుంటేపై ఆసుపత్రులకు రిఫర్‌పై తీసుకవెళ్లడం వంటి బాధ్యతలను నిర్వర్తిస్తున్నారు.

నామమాత్రంగా పారితోషికాలు...

పల్లెల్లో ఆశా వర్కర్లు చేసే పనులన్నింటికీ నామమాత్రపు పారితోషి కాలను ప్రభుత్వం ఇస్తోంది. పనిని బట్టి నెలకు ఒక్కో ఆశా వర్కర్‌కు రూ. 2 వేల నుంచి రూ. 8 వేల వరకు మాత్రమే చెల్లిస్తోంది. రోజంతా పల్లెల్లో సేవలందిస్తున్నా వారికి సరియైన పారితోషికం ప్రభుత్వం ఇవ్వకుండా వెట్టి చాకిరీ చేయించు కుంటోందని ఆరోపిస్తున్నారు. రోజురోజుకు పెరుగు తున్న నిత్యావసర వస్తువుల ధరలకు తగ్గట్టుగా పారితోషికాలు లేకపోవడంతో ఆర్థికంగా ఇబ్బందులకు గురవుతున్నారు.

ఇవీ డిమాండ్స్..

- 2023 డిసెంబరు, 2024 జనవరి మాసపు పారితోషికాలు తక్షణమే చెల్లించాలి. గతంలో ఇచ్చిన విధంగా ప్రతీ నెల 2వ తేదీన ఆశలకు పారితోషికాలు అందించాలి.
- పారితోషికం లేని అభయ హస్తం, మహాలక్ష్మీ తదితర అదనపు పనులు ఆశాలతో చేయించకూడదు.
- ఏఎన్‌సీ డెలవరీల పేరుతో టార్గెట్స్ ఆశాలను భయభ్రాంతులకు గురిచేస్తున్న విధానాన్ని రద్దు చేయాలి.
- సమ్మె సందర్భంగా 2023 అక్టోబరు 9వ తేదీన ఇచ్చిన హామీలు వెంటనే అమలు చేయాలి.
- పెరుగుతున్న ధరలకు అనుగుణంగా పారితోషికాలను రూ. 18 వేలకు పెంచి, ఫిక్స్‌డ్ వేతనం నిర్ణయించాలి.
- 2021 జూలై నుంచి డిసెంబరు వరకు 6 నెలల పీఆర్‌సీ ఏరి యర్స్‌ను వెంటనే చెల్లించాలి.
- కేంద్రం చెల్లించిన కరోనా రిస్ట్ అలవెన్స్ నెలకు రూ. వెయ్యి చొప్పున 16 నెలల బకాయి డబ్బులు వెంటనే ఇవ్వాలి.
- ఆశాలకు పీఎఫ్, ఈఎస్ఐ సౌకర్యం, ఉద్యోగ భద్రత కల్పించాలి.
- ప్రమాద బీమా సౌకర్యం రూ. 5 లక్షల వరకు కల్పించాలి.
- ఆశాలకు రిటైర్‌మెంట్ బెనిఫిట్స్ రూ. 5 లక్షలు ఇవ్వాలి.
- అభయ హస్తం, మహాలక్ష్మీ తదితర సంక్షేమ పథకాలన్నింటినీ ఆశాలకు వర్తింపజేయాలి.
- ఏఎన్ఎం, జీఎన్ఎం తదితర పోస్టుల్లో ఆశాలకు ప్రమోషన్ సౌక ర్యం కల్పించాలి. వెయిటేజీ మార్కులు నిర్ణయం చేయాలి.
- మట్టి ఖర్చులు రూ. 50 వేలు చెల్లించాలి.
- టీబీ స్ఫూటమ్ డబ్బాలను ఆశాలతో మోపించే పనిని రద్దు చేయాలి.
- టీపీ లెప్రసీ తదితర పెండింగ్ బిల్లులు వెంటనే చెల్లించాలి.
- ఆశాలకు పని భారం తగ్గించాలి. జాబ్ చార్ట్‌ను విడుదల చేయాలి.
- 32 రకాల రిజిష్టర్స్‌ను వెంటనే ప్రింట్ చేసి ప్రభుత్వం సరఫరా చేయాలి.
- క్వాలిటీతో కూడిన యూనిఫామ్స్‌ను అందించాలి.
- ఆశాలకు ప్రసూతి సెలవుల పైన ఉత్తర్వులు వెంటనే జారీ చేయాలి.
- ఆశాలకు జిల్లా, పీహెచ్‌సీ కేంద్రాలలో రెస్ట్ రూమ్ ఏర్పాటు చేయాలి.

ఆశా వర్కర్ల డిమాండ్‌లను వెంటనే నెరవేర్చాలి



సులోచన, సీఐటీయూ జిల్లా నాయకురాలు

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న ఆరోగ్య కార్యక్రమాలను ప్ర జల్లోకి తీసుకవెళ్లి విజయవంతం చేయడంలో ఆశా వర్కర్లు కీలక పాత్ర నిర్వహిస్తున్నారు. ఆశా వర్కర్లకు ఏ నెలకు ఆ నెల సక్రమంగా పారితో షి కాలు అందించకపోవడం, ఇతర సమస్యలను పరిష్కరించకపోవడం వల్ల ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ప్రభుత్వం వెంటనే స్పందించి ఆశావర్కర్ల న్యాయమైన డిమాండ్‌లను వెంటనే పరిష్కరించాలి.

నెలకు రూ. 18 వేతనం ఇవ్వాలి



మాదాసు మంజుల, ఆశా వర్కర్, సారంగపూర్

పల్లెల్లో ఆరోగ్య సేవలను అందిస్తున్న ఆశా వర్కర్లకు ప్రభుత్వం నెలకు రూ. 18 వేల వేతనం అందించాలి. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఆరోగ్య పథకాలు, సంక్షేమ కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకవెళ్లి విజయవంతం చేయడానికి ప్రతీ నిత్యం పల్లెల్లో పర్యటిస్తూ సేవలందిస్తున్న ఆశా వర్కర్లకు ఫిక్స్ డ్ వేతనాలు అందించాల్సిన అవసరముంది. ఆశా వర్కర్ల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం అవసరమైన చర్యలు తీసుకోవాలి.

జగిత్యాల డీఆర్‌డీవో బదిలీ

జడ్పీ సీఈవోగా సంపత్ రెడ్డి

జగిత్యాల, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): జగిత్యాల ఇన్‌చార్జి డీఆర్‌డీవోగా పనిచేస్తున్న డిప్యూటీ సీఈవో పి నరేశ్‌ను జయ శంకర్ భూపాలపల్లి జిల్లా డీఆర్‌డీఓగా బదిలీ చేస్తూ ప్రభుత్వ ప్రిన్సిపాల్ సెక్రటరీ సందీప్ కుమార్ సుల్తానియా సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. వరంగల్ డీఆర్‌డీవో సంపత్ రావును జగిత్యాల డీఆర్‌డీవోగా నియమించారు. అదేవిధంగా సిరిసిల్లలో అడిషనల్ డీఆర్‌డీఓగా పనిచేస్తున్న సీహెచ్ మదన్ మోహన్‌ను జగిత్యాల అడిషనల్ డీఆర్‌డీవోగా బదిలీ చేశారు. ఖాళీగా ఉన్న జగిత్యాల జడ్పీ సీఈవో స్థానంలో రాజన్న సిరిసిల్ల జిల్లా జడ్పీ సీఈవోగా పనిచేస్తున్న బొమ్మెన సంపత్ రెడ్డిని నియమించారు. జగిత్యాలలో జడ్పీ డిప్యూటీ సీఈవో రఘువరన్ ఇన్‌చార్జి సీఈవోగా బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు. రానున్న రెండు,మూడు రోజుల్లో సంపత్ రెడ్డి జడ్పీ సీఈవోగా బాధ్యతలు తీసుకోనున్నట్లు జడ్పీ అధికార వర్గాలు అంటున్నాయి.

గల్ఫ్ కార్మికులకు సామాజిక భద్రత కల్పించాలి

ప్రధాని మోదీకి టీపీసీసీ ఎన్ఆర్ఐ సెల్ కన్వీనర్ భీంరెడ్డి లేఖ

జగిత్యాల, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): ప్రధాని నరేంద్ర మోదీ ఈనెల 13, 14 తేదీల్లో అబుదాబిలో పర్యటించనున్న సందర్భంగా గల్ఫ్ కార్మికుల పక్షాన టీపీసీసీ ఎన్ఆర్ఐ సెల్ కిన్వనర్ మంద భీంరెడ్డి సోమవారం బహిరంగ లేఖ రాశారు. గల్ఫ్ దేశాలలో సుమారు 88 లక్షల మంది వలస కార్మికులు నివసిస్తున్నారని వారికి కేంద్ర ప్రభుత్వం సామాజిక భద్రత కల్పించాలని విజ్ఞప్తి చేశారు. గమ్యస్థాన గల్ఫ్ దేశాలలో అభివృద్ధిలో పాలుపంచుకుంటూ స్వదేశానికి అత్యధిక విదేశీ మారక ద్రవ్యం పంపిస్తున్న ప్రవాస భారతీయ కార్మికుల సేవలను గుర్తించాలని కోరారు. గల్ఫ్ ప్రాంతంలో పనిచేసే వలస కార్మికుల సంక్షేమానికి పథకాలు ప్రకటించాలని లేఖలో కోరారు. సౌదీ అరేబియా, యూఏఈ, ఓమాన్, కువైట్, ఖతార్, బహరేన్, ఆరు అరబ్ గల్ఫ్ దేశాలల్లోని ప్రవాస భారతీయ సంఘాల ప్రతినిధులతో సంక్షేమ, సామాజిక భద్రతా పథకాల గురించి కార్మికులకు అవగాహన కల్పించాల్సిన అవసరముందన్నారు. వలస వచ్చే కార్మికులకు పునరావాసం కల్పించాలని, విదేశీ మారకద్రవ్యం పంపేవారికి బంగ్లాదేశ్ ప్రభుత్వం లాగా రెండున్నర శాతం ప్రోత్సహకం అందించాలని, భారత దేశం నుంచి విదేశాలకు వెళ్లే ప్రతీ పౌరుడి వివరాలను భారతీయ విమానాశ్రయాల్లో రిజిస్ట్రేషన్ చేయాలని కోరుతూ ప్రధాని నరేంద్ర మోదీకి లేఖను పంపినట్లు మంద భీంరెడ్డి వివరించారు.

'ఏడో వార్డులో పిచ్చి మొక్కలు తొలగించండి'

ధర్మపురి, ఫిబ్రవరి 12: పట్టణంలోని ఏడవ వార్డులో గల వక్ఫ్ బోర్డ్ సంబంధించిన స్థలంలో పిచ్చి మొక్కలు తొలగించి, పరిశుభ్రంగా ఉంచాలని కోరుతూ హిందూ ఐక్య వేదిక ఆధ్వర్యంలో మున్సిపల్ సానిటరీ ఇన్స్ పెక్టర్ గంగాధర్‌కు సోమవారం వినతి పత్రాన్ని సమర్పించారు. హిందూ ఐక్య వేదిక సభ్యులు ఉదయం మున్సిపల్ కార్యాలయానికి వెళ్లి పలు సమస్యలతో కూడిన వినతి పత్రాన్ని ఆయనకు అందించారు. ఈ సందర్భంగా హిందూ ఐక్య వేదిక సభ్యులు మాట్లాడుతూ ఈ స్థలంలో పిచ్చి మొక్కలు మొలచి అరణ్యం వలె అగుపిస్తుందన్నారు. దీంతో చుట్టు పక్క ఉన్న ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. వెంటనే సమస్యను పరిష్కరించాలని కోరారు.

ప్లాస్టిక్ వినియోగిస్తే చర్యలు తప్పవు

మున్సిపల్ కమిషనర్ అనీల్ బాబు



తనిఖీలు నిర్వహిస్తున్న మున్సిపల్ అధికారులు

జగిత్యాల టౌన్, ఫిబ్రవరి 12 : ప్రభుత్వ నియమ నిబంధనల ప్రకారం 75 మైకాన్ల కన్నా తక్కువ ఉన్న ప్లాస్టిక్‌ను వినియోగిస్తే చర్యలు తప్పవని మున్సిపల్ కమిషనర్ అనీల్ బాబు అన్నారు. సోమవారం జిల్లా కేంద్రంలోని టవర్, పాత బస్టాండ్, ధర్మపురి రోడ్ తదితర ప్రాంతాల్లో ప్లాస్టిక్ కవర్లు విక్రయిస్తున్న పలు దుకాణాలపై మున్సిపల్ అధికారులు, సిబ్బంది దాడులు నిర్వహించారు. నిబంధనలు అతిక్రమించిన పలువురికి జరిమానా విధించారు. ప్రతి ఒక్కరూ విధిగా ట్రేడ్ లైసెన్స్ తీసుకోవాని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ అధికారులు అశోక్, లత, శ్రీకాంత్ ఉన్నారు.

బదిలీపై వెళ్తున్న ఎంపీడీవోకు సన్మానం

గొల్లపల్లి, ఫిబ్రవరి 12: గొల్లపల్లి ఎంపీడీవోగా బాధ్యతలు నిర్వహించి బదిలీపై యాదాద్రి భువనగిరి జిల్లాకు వెళ్తన్న ఎంపీడీవో నవీన్ కుమార్‌ను ఘనంగా సన్మానించారు. గొల్లపల్లి జడ్పీటీసీ గోస్కుల జలంధర్, చెందోలి సింగిల్ విండో చైర్మన్ గాండె వెంకట మాధవ రావు పాల్గొన్నారు.

జగిత్యాల, మెట్‌పల్లి డీఎస్పీల బదిలీ

జగిత్యాల, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): జగిత్యాల, మెట్‌పల్లి డీఎస్పీలను బదిలీ చేస్తూ సోమవారం రాత్రి ఉత్తర్వులు జారీ అయ్యాయి. జగిత్యాలలో పనిచేస్తున్న డీఎస్పీ వెంకటస్వామిని హైదరాబాద్ సిటీ హెడ్ క్వార్టర్స్ సీపీటీసీ ఏసీపీగా బదిలీ చేయగా, ఈయన స్థానంలో వరంగల్ జిల్లా వర్ధన్నపేట ఏసీపీగా పనిచేస్తున్న డి. రఘు చందర్‌ను జగిత్యాల డీఎస్పీగా నియామకం చేశారు. అదేవిదంగా మెట్‌పల్లిలో పనిచేస్తున్న డీఎస్పీ వి. రవీందర్ రెడ్డిని బదిలీ చేస్తూ డీజీపీ కార్యాలయంలో రిపోర్ట్ చేయాల్సిందిగా ఆదేశించారు. ఈయన స్థానంలో టీఎస్ సైబర్ సెక్యూరిటీ బ్యూరో డీఎస్పీగా పనిచేస్తున్న కె ఉమా మహేశ్వర్ రావును మెట్‌పల్లి డీఎస్పీగా నియామకం చేశారు. ఈ మేరకు డీజీపీ కార్యాలయం నుంచి ఉత్తర్వులు వెలువడ్డాయి.

పాఠశాలలో డీఈవో విచారణ

రాయికల్, ఫిబ్రవరి 12: మండలంలోని కట్కాపూర్ మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో విద్యార్థుల నుంచి నెలనెలా ఫీజులు వసూలు చేస్తున్నారని సోమవారం కలెక్టర్‌కు విద్యార్థుల తల్లిదండ్రులు ఫిర్యాదు చేశారు. విద్యార్థుల నుంచి నెలనెలా ఫీజులు వసూలు చేస్తున్నారని, ఫీజులు కట్టనివారికి ఎండలో బయట నిలబెడుతున్నారని అన్నారు. ఫీజులు వసూలు చేస్తున్న ప్రధానోపాధ్యాయునిపై చర్యలు తీసుకోవాలని కోరారు. కలెక్టర్ ఆదేశాల మేరకు డీఈవో జగన్మోహన్ రెడ్డి పాఠశాలలో విచారణ చేపట్టారు. నివేదికను ఉన్నతాధికారులకు అందజేయనున్నట్లు డీఈవో తెలిపారు.

అయోధ్యకు బయలు దేరిన రామ భక్తులు



ధర్మపురి నుంచి బయలుదేరుతున్న రామ భక్తులు

ధర్మపురి, ఫిబ్రవరి 12: ధర్మపురి క్షేత్రం నుంచి అయోధ్య బలరాముని దర్శనం కోసం రామ భక్తులు సోమవారం బయలుదేరారు. స్థానిక నంది విగ్రహం వద్దకు పట్టణంలోని, మండలంలోని పలు గ్రామాలకు చెందిన 70 మంది రామ భక్తులు జై శ్రీరామ్ నినాదాలతో చేరుకున్నారు. అనంతరం హిందూ ఐక్య వేదిక ఆధ్వర్యంలో బండారి లక్ష్మణ్, భాస్కర్, బండారి సత్యనా రాయణ, సూరజ్, శ్రీధర్, శివసాయి కలిసి రామ భక్తుల మెడలో పూలమా ల వేశారు. కర సేవకులు గుండయ్య జెండా ఊపి అయోధ్య యాత్రకు పంపించారు.

పెగడపల్లి: మండల కేంద్రంలోని స్వయంభూ శ్రీరాజరాజేశ్వర స్వా మి ఆలయంలో పూజలు చేసి అయోధ్య రామమందిరానికి మండల భ క్తులు 40 మంది సోమవారం బయలుదేరి వెళ్లారు. బీజేపీ మండల అధ్యక్షుడు కొమురెల్లి, కిషోర్, మోహన్‌రెడ్డి, బాబు, అంజన్న, నర్సింహారెడ్డి, అంజి తరలివెళ్లారు.

ప్రజావాణిలో వెల్లువెత్తిన ఫిర్యాదులు

37 దరఖాస్తులు స్వీకరించిన కలెక్టర్, అదనపు కలెక్టర్



ఫిర్యాదులను స్వీకరిస్తున్న కలెక్టర్ షేక్ యాస్మిన్ బాషా

జగిత్యాల, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని సమీకృత కలెక్టరేట్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్ర మంలో ఫిర్యాదులు వెల్లువెత్తాయి. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన 37 మంది బాధితుల వద్ద నుంచి కలెక్టర్, స్థానిక సంస్థల అద నపు కలెక్టర్ దివాకరలు ఫిర్యాదులను స్వీకరించారు. పలు ఫిర్యాదులను అక్కడికక్కడే పరిష్కరించగా, మరికొన్నింటిని సంబందిత శాఖల జిల్లా అధికారులకు పరిష్కారానికి ఆదేశించారు. కలెక్టర్ మాట్లాడారు. ప్రజావాణి ఫిర్యాదులను త్వరితగతంగా పరిష్కరించాలని ఆదేశించారు.

సర్కారు బడిలో ఫీజు వసూళ్లపై ఫిర్యాదు..

రాయికల్ మండలం కట్కాపూర్ ఎంపీపీఎస్ పాఠశాలలో ప్రతీ నెల విద్యార్థుల వద్ద నుంచి ఫీజు వసూలు చేస్తున్న హెడ్ మాస్టర్‌పై చర్యలు తీసుకోవాలని కోరుతూ పాఠశాలకు చెందిన పలువురు పేరెంట్స్ కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. పాఠశాలలో ముగ్గురు ఉపాధ్యాయులు న్నప్పటికీ నలుగురు వలంటీర్లను అనధికారికంగా నియామకం చేసి ఒక్కో విద్యార్థి నుంచి నెలకు రూ. 700 ఫీజులు వసూలు చేస్తున్నారని ఆరోపించారు. ఫీజు ఇవ్వని విద్యార్థులను ఎండలో నిల్చోబెట్టి హాల్ టికెట్ సైతం ఇవ్వడం లేదని తెలిపారు.

డ్రాయింగ్, క్రాఫ్ట్, మ్యూజిక్ టీచర్లను నియమించాలి

జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల్లో ఖాళీగా ఉన్న డ్రాయింగ్, క్రాఫ్ట్, మ్యూజిక్ టీచర్ల పోస్టులను డీఎస్‌సీ ద్వారా భర్తీ చేయాలని కోరుతూ జిల్లా అదనపు కలెక్టర్ దివాకరకు పలువురు నిరుద్యోగులు మ్యాడారు మారుతి చారీ, గజం రవికాంత్, నరేందర్, సురేశ్‌లు వినతిపత్రం అందించారు. కేంద్ర ప్రభుత్వం ఆదీనంలో నిర్వహిస్తున్న సర్వ శిక్ష అభియాన్ స్కూళ్లలో గల డ్రాయింగ్, క్రాఫ్ట్, మ్యూజిక్ కాంట్రాక్టు పద్ధతిలో భర్తీ చేయాలని కోరారు. సారంగపూర్ మీదుగా జన్నారంకు వెళ్లే ఆర్‌టీసీ బస్సులో రద్దీ ఎక్కువగా ఉంటోందని, అదనపు బస్సు నడపాలని కోరుతూ బీఆర్ఎస్ విద్యార్థి నాయకులు బోగోజి, ము కేష్ ఖన్నా, రామ్, అమర్, పాశా కుమార్‌లు ఫిర్యాదు చేశారు.

చైన్ స్నాచింగ్‌కు యత్నం

రాయికల్, ఫిబ్రవరి 12: రాయికల్ శివారులోని జనమయి చెరువు వద్ద ఒంటరిగా బట్టలు ఉతుకుతున్న మహిళ మెడలోంచి రాయికల్ పట్టణం ఇందిరానగర్‌కు చెందిన పడిగెల రాజేష్ చైన్ స్నాచింగ్‌కు యత్నించాడు. ఆమె కేకలు వేయడంతో యువకులు పట్టుకుని పోలీసులకు అప్పజెప్పారు. మహిళ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై అజయ్ తెలిపారు.

సీసీ రోడ్డు పనులు ప్రారంభం

భీమారం, ఫిబ్రవరి 12: మండల కేంద్రంలో వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ చొరవతో ఎన్ఆర్ఈజీఎస్ నిధులు రూ.5 లక్షలతో నిర్మించనున్న సీసీ రోడ్డు పనులను గ్రామ కాంగ్రెస్ నాయకులు సోమవారం ప్రారంభించారు. నిధులు మంజూరు చేసిన ఎమ్మెల్యేకు వారు కృతజ్ఞతలు తెలిపారు. కాంగ్రెస్ నాయకులు వినయ్ ఉన్నారు.

16న దేశ వ్యాప్త సమ్మెను విజయవంతం చేయాలి

సీఐటీయూ జిల్లా కన్వీనర్ ఇందూరి సులోచన

జగిత్యాల, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): కేంద్రంలోని బీజేపీ అనుసరిస్తున్న ప్రజా, కార్మిక, రైతు, వ్యవసాయ కూలీల వ్యతిరేక విధానాలను నిరసనగా జాయింట్ ప్లాట్ ఫాం ఆఫ్ ట్రేడ్ యూనియన్స్ ఆధ్వర్యంలో ఈనెల 16వ తేదీన నిర్వహిస్తున్న దేశ వ్యాప్త సమ్మెను విజయవంతం చేయాలని సీఐటీయూ జిల్లా కన్వినర్ ఇందూరి సులోచన అన్నారు. సోమవారం పట్టణంలోని సమీకృత కలెక్టరేట్ కార్యాలయంలో గల డీఈవో కార్యాలయ అధికారులకు పలువురు మధ్యాహ్న భోజన కార్మికులతో కలిసి సమ్మె నోటీసును అందించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. సమ్మెలో మధ్యాహ్న భోజన పథకం కార్మి కులు సైతం భాగస్వామ్యుల వుతున్నారన్నారు. ఐఎన్‌టీ యూసీ, ఏఐటీయూసీ, ఏఐయుటీ యుసీ తదతర కార్మిక సంఘాలు, వివిధ రంగాల ఉద్యోగ సం ఘాలు, అఖిల భారత ఫెడరేషన్లు, సంయుక్త కిసాన్ మోర్చ నాయకులు కార్మికుల సమ్మెతో పాటు గ్రామీణ భారత్ బంద్ పాటించాలని నిర్ణయించాయని తెలిపారు. కార్మిక సంఘం నాయకులు వెంకటచారీ, గౌరవ్వ పాల్గొన్నారు.




అధికారికి సమ్మె నోటీసును అందిస్తున్న మధ్యాహ్న భోజన కార్మికులు

ఉత్తమ సేవలతోనే ఉద్యోగులకు గుర్తింపు

- బదిలీపై వెళ్తున్న ఎంపీడీవోలకు సన్మానం
- జడ్పీచైర్‌పర్సన్ దావ వసంతసురేష్

జగిత్యాలరూరల్, ఫిబ్రవరి 12 : ఉత్తమ సేవలతోనే ఉద్యోగులకు గుర్తింపు వస్తుందని జడ్పీ చైర్‌పర్సన్ దావ వసంతసురేష్ అన్నారు. బదిలీపై ఇతర జిల్లాలకు వెళ్తున్న జిల్లాలో పనిచేసిన ఎంపీడీవోలను జడ్పీ కార్యాలయంలో జడ్పీచైర్‌పర్సన్ సోమవారం ఘనంగా సన్మా నించారు. ఈసం దర్భంగా జడ్పీచైర్‌పర్సన్ మాట్లాడుతూ ఉద్యోగులు ప్రజలకు అందించిన సేవలు చిరస్మరణీయంగా ఉంటాయన్నారు. అంకితభావంతో పని చేసే ప్రతి ఉద్యోగికి ప్రజల్లో మంచి గుర్తింపు, గౌరవం ఉంటుందన్నారు. జడ్పీచైర్‌పర్సన్‌గా పదవికాలం చేపట్టిన నాటి నుంచి చాలామంది ఎంపీడీవోలు విధులు నిర్వహించారని, ఒక కుటుంబం లాగా ముందుకు సాగి ప్రజలకు సేవలందించామని గుర్తు చేశారు. తెలంగాణ ప్రభుత్వం ఏర్పడ్డాక తొలి జడ్పీచైర్‌పర్సన్‌గా ఎన్ని కవ్వడం సంతోషానిచ్చిందని, తనకు గుర్తింపురావడంలో ఎంపీడీవోల పాత్ర ఉందని అభినందించారు. ఉన్నతపదవులను అధిరోహించాలని ఆకాంక్షించారు. ఈకార్యక్రమంలో జడ్పీ సీఈవో రఘువరన్, ఎంపీడీవోలు పాల్గొన్నారు.



ఎంపీడీవోలను సన్మానిస్తున్న జడ్పీ చైర్‌పర్సన్ దావ వసంతసురేష్

ఇంజనీరింగ్ విద్యార్థులు వర్క్‌షాప్‌ను సద్వినియోగం చేసుకోవాలి


వర్క్‌షాప్‌లో మాట్లాడుతున్న కన్వీనర్ వసంత్‌కుమార్

కొడిమ్యాల, ఫిబ్రవరి 12 : ఇంజనీరింగ్ విద్యార్థులు వారం రోజులు నిర్వహించే వర్క్‌షాప్‌ను సద్వినియోగం చేసుకోవాలని మెకానికల్ విభాగాధిపతి, కన్వీనర్ డా.. కె. వసంత్‌కుమార్ అన్నారు. సోమవారం మండలంలోని నాచుపల్లి జేఎన్‌టీయూ ఇంజనీరింగ్ కళాశాలలో వారం రోజుల పాటు నిర్వహించే ఫైనైట్ ఎలిమెంట్ అనాలసెస్ యూజింగ్ అన్సిస్ వర్క్ బెంచ్ ప్రారంభం చేశారు. ఈ సందర్భంగా కన్వీనర్ మాట్లాడుతూ ఈ సాఫ్ట్‌వేర్‌ను ఉపయోగించుకొని ఏదైనా రియల్ ప్రొడక్ట్‌ను తయారు చేయకుండానే దాని మోడల్‌ను ప్రిపేర్ చేసుకోవచ్చునన్నారు. చేసిన మోడల్ ఎంత వరకు పనిచేస్తుందో తెలుసుకోవ చ్చునన్నారు. అసలు ప్రొడక్ట్ తయారు చేయకుండానే ఖర్చును తగ్గించుకొని ఇచ్చిత్వాన్ని తెలుసుకోవచ్చన్నారు. ఈ సాఫ్ట్‌వేర్ తెలుసుకోవటంతో ప్రొడక్ట్ ఎలా పనిచేస్తుంది, ఏ మెటీరీయల్ వాడాలన్న విషయాలు తెలుస్తాయన్నారు. ఈ వర్క్‌షాప్‌కు సహకరించిన రిసోర్స్ పర్సన్ రాజ మహేంద్ర సిమ్యులేషన్ ఇంజనీర్ హైదరాబాదు, మెకానికల్ ఫ్యాకల్టీ కోకన్వీనర్ డా.. సురేష్ అర్జుల్లా, కోఆర్డినేటర్ బి. నర్సయ్యకు విద్యార్థులు కృతజ్ఞతలు తెలిపారు. ఈ వర్క్ షాప్‌లో వైస్ ప్రిన్సిపాల్ డా.. టి.వేణుగోపాల్, వివిధ విభాగాల అధిపతులు, బోధన, బోధనేతర సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

రెండు ద్విచక్ర వాహనాలు ఢీ : ఇద్దరికి గాయాలు

బోయినపల్లి, ఫిబ్రవరి12: రెండు ద్విచక్ర వాహనాలు ఢీకొన్న ప్రమాదంలో ఇద్దరికి గాయాలైన సంఘటన బోయినపల్లి మండలం దేశాయిపల్లి సమీపాన సోమవారం జరిగింది. ఈ ప్రమాదంలో ఇద్దరు వ్యక్తులకు తీవ్ర గాయాలయ్యాయి. గాయపడ్డ వారి వివరాలు తెలియాల్సి ఉంది.

వేములవాడకు పోటెత్తిన భక్తులు



భక్తులతో కిక్కిరిసిపోయిన ఆలయ పరిసరాలు



క్యూలైన్లలో బారులు తీరిన భక్తులు

వేములవాడ, ఫిబ్రవరి 12 : దక్షిణ కాశీ, ప్రముఖ పుణ్యక్షేత్రం వేములవాడ రాజరాజేశ్వర స్వామి వారి దేవస్థానం సోమవారం నాడు అశేష భక్తజనంతో జాతరను తలపించింది. మేడారం సమ్మక్క సారలమ్మ జాతరకు వెళ్లడానికి ముందు రాజరాజేశ్వర స్వామి వారిని దర్శించుకునేందుకు ప్రతినిత్యం వేలాది మంది భక్తులు తరలివస్తుండడంతో వేములవాడ పుణ్యక్షేత్రంలో గత కొద్ది రోజులుగా జాతరను పోలిన వాతావరణం నెలకొంది. ఈ క్రమంలో సోమవారం నాడు సుమారు 60 వేలకు పైగా భక్తులు రాజరాజేశ్వర స్వామి వారిని దర్శించుకుని మొక్కులు చెల్లించినట్లు అంచనా. ఆదివారం తెల్లవారుజాము నుండి నిరంతరాయంగా కొనసాగిన స్వామివారి దర్శనం సోమవారం రాత్రి వరకు సాగింది. ఫలితంగా ఆదివారం ఉదయం నుంచి సోమవారం రాత్రి వరకు సుమారు 90 వేల మంది భక్తులు స్వామివారిని దర్శించుకున్నట్లు అంచనా. ఈ సందర్భంగా వారు ఆలయ కళ్యాణ కట్టలో తలనీలాలు సమర్పించి ధర్మగుండంలో పవిత్ర స్నానాలు ఆచరించారు. అనంతరం సర్వదర్శనం, శీఘ్ర దర్శనం క్యూలైన్ల మీదుగా ఆలయంలోకి చేరుకొని రాజరాజేశ్వర స్వామి వారిని దర్శించుకున్నారు. భక్తుల రద్దీ అధికంగా ఉన్న కారణంగా గర్భాలయ ప్రవేశం నిలిపివేసి స్వామివారి దర్శనం త్వరితగతిన సాగే విధంగా ఆలయ అధికారులు చర్యలు తీసుకున్నారు. దీంతో భక్తులు నందీశ్వరుడి వద్ద నుంచి స్వామివారిని దర్శించుకున్నారు. గర్భాలయంలో అభిషేకం, అన్నపూజ నిలిపివేయడంతో క్యూ లైన్లు వేగంగా కదిలాయి. స్వామివారికి ప్రీతిపాత్రమైన కోడెమొక్కు చెల్లించుకునేందుకు భక్తులు గంటల కొద్దీ నిరీక్షించాల్సి వచ్చింది. కోడె మొక్కు క్యూలైన్ పార్కింగ్ స్థలం వరకు సాగడంతో మొక్కు చెల్లింపుకు సుమారు నాలుగు నుండి ఐదు గంటల పైగా సమయం అవసరమైంది. ఆదివారం ఉదయం నుండి ప్రారంభమైన కోడె మొక్కు చెల్లింపు సోమవారం రాత్రి వరకు నిరంతరాయంగా సాగింది. వేలాదిగా తరలివచ్చిన భక్తులతో రాజన్న ఆలయ ప్రాంగణం తో పాటు ప్రధాన వీధులు, జాత్రా గ్రౌండ్ ప్రాంతం కిటకిటలాడింది. భక్తుల వాహనాలతో గుడి చెరువు పార్కింగ్ ప్రదేశం పూర్తిగా నిండిపోయింది. బద్ది పోచమ్మ ఆలయంలో భక్తుల రద్దీ కొనసాగింది. వేలాది మంది భక్తులు తలపై బోనం పెట్టుకొని క్యూ లైన్లలో గంటల కొద్దీ నిరీక్షించి తమ వంతు రాగానే ఆలయంలో చేరుకుని బద్ది పోచమ్మ అమ్మవారి కి బోనం సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. అనుబంధ ఆలయమైన శ్రీ భీమేశ్వరాలయంలోనూ భక్తుల రద్దీ కొనసాగింది. ఈ సందర్భంగా భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఆలయ ఈవో కృష్ణ ప్రసాద్ నేతృత్వంలో అధికారులు తగిన ఏర్పాట్లు చేశారు.

డీఈఈ సెట్ ప్రవేశాలకు ధ్రువపత్రాల పరిశీలన

తిమ్మాపూర్, ఫిబ్రవరి12: డీఈఈ సెట్-2023లో ఉత్తీర్ణులై ఇప్పటి వరకు ఒరిజినల్ ధ్రువ పత్రాల పరిశీలన చేయించుకోని ఉమ్మడి కరీంనగర్ జిల్లా అభ్యర్థులు మూడవ దశలో ప్రవేశాల కోసం ఈ నెల 14న ఉదయం 10గంటల నుంచి సాయంత్రం 5గంటల వరకు మండలంలోని ఎల్ఎండి కాలనీలో గల ప్రభుత్వ జిల్లా విద్యా శిక్షణ సంస్థ(డైట్)లో తమ సర్టిఫికెట్ల పరిశీలన చేయించుకోవచ్చని డైట్ ప్రిన్సిపాల్ శ్రీరాం మొండయ్య ఒక ప్రకటనలో తెలిపారు. ప్రభుత్వ జిల్లా విద్యా శిక్షణ సంస్థ(డైట్)లో రెండు సంవత్సరాల కోర్సు డిప్లొమా ఇన్ ఎలిమెంటరీ ఎడ్యుకేషన్(డిఈఎల్ఈడి), డిప్లొమా ఇన్ ప్రీస్కూల్ ఎడ్యుకేషన్(డిపిఎస్ఈ) మొదటి సంవత్సరం 2023-24లో చేరుటకు నిర్వహించిన డీఈఈ సెట్-2023లో ఉత్తీర్ణులైన అభ్యర్థులు తమ అన్ని ఒరిజినల్ ధ్రువపత్రాలతో డైట్‌కు రావాలని కోరారు. మూడవ దశ ప్రవేశాలకు ఈ నెల 15 నుంచి 17 వరకు ఆప్షన్ పెట్టుకో వచ్చన్నారు. మరిన్ని వివరాలకు డీఈఈ సెట్ వెబ్‌సైట్‌ను సందర్శించాలని డైట్ ప్రిన్సిపాల్ శ్రీరాం మొండయ్య తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో మహిళకు గాయాలు

హుజూరాబాద్‌రూరల్, ఫిబ్రవరి 12 : మండలంలోని రాజాపల్లి గ్రామ శివారులో సోమవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరికి గాయాలయ్యాయి. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. హన్మకొండకు చెందిన ఆర్ కల్పన అనే మహిళ ఓ ప్రైవేట్ ఫైనాన్స్ కంపెనీలో పనిచేస్తుండగా, విధుల్లో భాగంగా జమ్మికుంటకు వచ్చి తిరుగు ప్రయాణంలో ద్విచక్ర వాహనంపై వెళ్తుంది. ఈ క్రమంలోనే రాజపల్లి గ్రామ శివారులోకి ద్విచక్ర వాహనం చేరుకోగానే, వాహనం అదుపు తప్పి పక్కనే బోర్డుకు ఢీకొట్టింది. ఈ ఘటనలో సదరు మహిళలకు గాయాలయ్యాయి. గమనించిన స్థానికులు వెంటనే 108కు సమాచారం అందించారు. మెరుగైన చికిత్స నిమిత్తం హుజూరాబాద్ ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

బ్యాంకులో అగ్నిప్రమాదం

కరీంనగర్ క్రైం, ఫిబ్రవరి 12: కరీంనగర్ కలెక్టరేట్ ఎదుట ఉన్న యూనియన్ బ్యాంక్‌లో సోమవారం మధ్యాహ్నం అగ్నిప్రమాదం జరిగి పలు ఫైళ్లు కాలిపోయాయి. విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణంగా యూబీఐ స్టోర్‌రూంలో మంటలు అంటుకుని ప్రమాదం జరిగిందని ఫైర్ ఆఫీసర్ పరమేశ్వర్ తెలిపారు. సమాచారం అందిన వెంటనే ఫైర్ ఇంజన్‌తో సహా ఘటనా స్థలానికి వెళ్లి మంటలను ఆర్పివేశామని ఆయన తెలిపారు.

శివంగాలపల్లిలో మూడు ఇళ్లలో చోరీ

కోనరావుపేట, ఫిబ్రవరి 12 : తాళం వేసి ఉన్న ఇళ్లను టార్గెట్ చేస్తూ కోనరావుపేట మండలంలో వరుస దొంగతనాలకు పాల్పడుతున్నారు. గత వారం రోజుల్లో నాలుగు గ్రామాల్లో దొంగలు చోరీకి పాల్పడ్డారు. కోనరావుపేట మండలం శివంగాలపల్లి గ్రామంలో సోమవారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు తాళం వేసి ఉన్న ఇళ్లలో చోరీకి పాల్పడ్డారు. బొడ్డు దేవయ్య, జంగం లక్ష్మి, గూడూరు రేణుక వీరు ఇళ్లకు తాళం వేసి తమ బంధువుల ఇంటికి వెళ్లారు. ఇదే అదునుగా భావించిన దొంగలు బొడ్డు దేవయ్య ఇంటిలో తాళం పగలగొట్టి 30 తులాల వెండి ,జంగం లక్ష్మి ఇంటిలో తాళం పగలగొట్టి 20 తులాల వెండి, గూడూరి రేణుక ఇంటి తాళం పగలగొట్టి మూడు వేల నగదును అపహరించారు. ఈ విషయం తెలుసుకున్న కోనరావుపేట ఎస్సై ఆంజనేయులు దొంగతనం తీరును పరిశీలించి సీసీ కెమెరాల ఫుటేజ్ తీయగా ఇద్దరు వ్యక్తులు మంకీ క్యాప్ ధరించి దొంగతనానికి పాల్పడుతున్నట్లు గుర్తించారు. ఎస్సై ఆంజనేయులు కేసు నమోదు చేసుకుని డాగ్ స్క్వాడ్‌తో గాలింపు చేపట్టారు.

కుక్కల దాడిలో ఆరుగురికి తీవ్ర గాయాలు

హుజూరాబాద్‌రూరల్, ఫిబ్రవరి 12: మండలంలోని పెద్దపాపయ్యపల్లి గ్రామంలో వీధి కుక్కలు స్వైర విహారం చేస్తూ ప్రజలను భయందోళనకు గురిచేస్తున్నాయి. గత రెండు రోజులుగా కుక్కలు దాడులకు ప్పాలడుతున్నాయి. సోమవారం వరకు ఆరుగురు కుక్కల దాడిలో గాయాలపాలయ్యారు. వృద్ధులు, పిల్లలు, మహిళలు బయటికి రావడానికి భయపడుతున్నారు. అధికారులు చర్యలు తీసుకోవాలని గ్రామస్థులు కోరుతున్నారు.

రూ.6,700 పలికిన పత్తి ధర

జమ్మికుంట, ఫిబ్రవరి 12: జమ్మికుంట వ్యవసాయ మార్కెట్లో క్వింటాల్ పత్తి ధర రూ.6,700 పలికింది. సోమవారం మార్కెట్ యార్డుకు 114మంది రైతులు 1,134క్వింటాళ్ల విడి పత్తి, ఎనిమిది మంది రైతులు 14క్వింటాళ్ల గోనె సంచుల్లో విక్రయానికి తీసుకు వచ్చారు. ప్రైవేట్ ట్రేడర్స్ బహిరంగ వేలం ద్వారా గరిష్ఠ ధర రూ.6,700, కనిష్ఠ ధర రూ.5,800 చెల్లించి పత్తి కొనుగోళ్లు చేపట్టారు.

ఆర్థిక ఇబ్బందులతో ఒకరి ఆత్మహత్య

వీణవంక ఫిబ్రవరి 12: మండలంలోని బొంతుపల్లి గ్రామానికి చెందిన ముష్క సదయ్య (45)ఆర్థిక ఇబ్బందులతో తన వ్యవసాయ పొలం వద్ద చెట్టుకు ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసుల వివరాల ప్రకారం.. కొంత కాలంగా ఆర్థిక ఇబ్బందులతో పాటు తన కూతురు పెళ్లి గురించి ఆలోచిస్తూ మనస్తాపానికి గురై ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడి భార్య రేణుక ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.


నందిమేడారంలో సైబర్ మోసం

ధర్మారం,ఫిబ్రవరి12: ధర్మారం మండలం నందిమేడారం గ్రామానికి చెందిన సందినేని పవన్‌కుమార్ ఎస్‌బీఐ ఖాతా నుంచి రూ. 10వేలు అతనికి తెలియకుండా వేలిముద్రతో సైబర్ నేరగాళ్లు డ్రా చేశారు. ఈ మేరకు సోమవారం బాధితుడు పవన్‌కుమార్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. తన ఎస్‌బీఐ ఖాతా నుంచి ఆదివారం సాయంత్రం ఏఈపీఎస్ ద్వారా పది వేల రూపాయల నగదును విత్‌డ్రా చేశారు. డ్రా చేసినట్టు తన సెల్ నంబరుకు మెసేజ్ వచ్చింది. ఆందోళనకు గురైన పవన్‌కుమార్ వెంటనే 1930 ఫిర్యాదు చేశాడు. ఈ నెల 9న ధర్మారం తహసీల్దార్ కార్యాలయంలో భూమి రిజిస్ట్రేషన్ కోసం తన వేలిముద్రలను ఉపయోగించాడు. అక్కడి నుంచి ఎవరో తన వేలిముద్రలను ఉపయోగించి మోసం చేశారని ఆయన అనుమానంతో సోమవారం బాధితుడు పవన్‌కుమార్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసినట్టు ఎస్సై సత్యనారాయణ తెలిపారు. సైబర్ నేరగాళ్ల పట్ల ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని ఆధార్ కార్డులను బయోమెట్రిక్ లాక్ చేసుకోవాలని ఆయన సూచించారు.

కుటుంబ కలహాలతో యువకుడి ఆత్మహత్య

ఎలిగేడు, ఫిబ్రవరి 12: మండలంలోని శివపల్లి గ్రామానికి చెందిన దొమ్మటి సాగర్(28)సోమవారం గడ్డి మందు తాగి ఆత్మహత్య చేసుకున్నట్లు జూలపల్లి ఎస్సై ఎన్.శ్రీధర్ తెలిపారు. ఆయన కథనం ప్రకారం.. గత కొన్ని రోజులుగా కుటుంబంలో కలతలు వచ్చాయని దీంతో జీవితంపై విరక్తి చెంది గడ్డి మందు తాగగా కుటుంబ సభ్యులు గమనించి కరీంనగర్ ఆసుపత్రికి తరలించారు. చికిత్స చేస్తుండగా మృతి చెందాడని తెలిపారు. సాగర్‌కు భార్య కల్యాణి, కూతురు 18నెలల పాప ఉందని తెలిపారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు. సాగర్ నేత్రాలను లయన్స్ క్లబ్‌వారు సేకరించారు.

ఎన్‌సీసీ శిక్షణ శిబిరానికి ఎంపిక



జ్యోత్స్న

కోల్‌సిటీటౌన్, ఫిబ్రవరి 12: నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ డిజాస్టర్ మేనేజ్‌మెంట్ ఆధ్వర్యంలో ఈ నెల 12వ తేదీ నుంచి 16వ తేదీ వరకు ఆంధ్రప్రదేశ్‌లోని కృష్ణా జిల్లాలో నిర్వహించే శిక్షణ శిబిరానికి గోదావరిఖని సెక్రెడ్ హార్ట్ హైస్కూల్‌కు చెందిన ఎన్‌సీసీ ఫస్ట్ ఆఫీసర్, శిక్షకురాలు జ్యోత్స్న ఎంపికయ్యారు. 9వ బెటాలియన్ తరుపున జ్యోత్స్న పాల్గొంటు న్నారు. ఈ మేరకు పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు, కరస్పాండెంట్, ఉపాధ్యాయ బృందం అభినందనలు తెలిపారు.

ఇద్దరు దొంగల అరెస్ట్

సిరిసిల్ల క్రైం , ఫిబ్రవరి 11 సిరిసిల్ల పట్టణంలోని శాంతినగర్‌కు చెందిన మల్లేశం ఇంట్లో సెల్ ఫోన్, రూ. 500 నగదు ఎత్తుకెళ్లిన ఇద్దరు దొంగలను సోమవారం అరెస్ట్ చేశామని టౌన్ సిఐ రఘుపతి తెలిపారు. పెయింటింగ్ చేస్తూన్నా శ్రీకాంత్, సంతోష్‌లు చోరీకి పాల్పడినట్లు అయన తెలిపారు.

మల్లికార్జున్‌రెడ్డికి మిలియనీర్ ఫార్మర్ అవార్డు

చొప్పదండి, ఫిబ్రవరి 12: చొప్పదండి మండలంలోని పెద్దకుర్మపల్లికి చెందిన ఉత్తమ రైతు మవురం మల్లికార్జునరెడ్డి డిస్ట్రిక్ మిలియనీర్ ఫార్మర్ ఆఫ్ ఇండియా అవార్డు అందుకున్నారు. సూర్యాపేట జిల్లా గడ్డిపల్లి కెవికెలో జరిగిన రైతు సదస్సులో మల్లికార్జున్‌రెడ్డి అవార్డును ఐసిఎఆర్ డిడిజి డాక్టర్ ఉత్తంసింగ్ గౌతం ఏటిఎఆర్‌ఐ డైరెక్టర్‌లు అందజేశారు. తనకు అవార్డు రావడానికి కృషి చేసిన జమ్మికుంట కెవికె డైరెక్టర్ వెంకటేశ్వరరావుకు ఈ సందర్భంగా మల్లిఖార్జునరెడ్డి ధన్యవాదాలు తెలిపారు.

రైల్వే లైన్ బాధితులకు పరిహారం చెల్లించాలి

వేములవాడ, ఫిబ్రవరి 12: వేములవాడ రైల్వే లేన్ నిర్మాణంలో భాగంగా భూములు కోల్పోతున్న బాధితులు సోమవారం సాయంత్రం ప్రజాహిత యాత్ర చేస్తున్న బండి సంజయ్‌ను కలిశారు. స్థానిక తెలంగాణ చౌక్ వద్దకు చేరుకున్న బండి సంజయ్‌ను కలిసిన బాధితులు తమకు తగిన పరిహారం చెల్లించాలని, లేదంటే తమ భూములను గెజిట్ నుంచైనా తొలగించాలని విజ్ఞప్తి చేశారు. ఈ విషయమై ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకువచ్చి తమకు న్యాయం చేయాలని కోరారు. గతంలో ఉన్న ఎమ్మెల్యేను ఈ అంశంపై పలుమార్లు కలిసినా పట్టించుకోలేదని వాపోయారు. దీనిపై స్పందించిన బండి సంజయ్ సమస్యను ప్రభుత్వం దృష్టికి తీసుకెళతానని హామీ ఇచ్చారు.

విద్యుత్ తీగలు అమర్చి చేపలు పట్టిన వ్యక్తుల రిమాండ్

ఎల్లారెడ్డిపేట, ఫిబ్రవరి 12: విద్యుత్తు తీగలు అమర్చి చేపలను వేటాడుతున్న సంఘటనలో ఎల్లారెడ్డిపేట మండలం పదిర గ్రామానికి చెందిన దొంతరవేణి విజయ్, కుర్ర భాస్కర్‌లపై కేసు నమోదు చేసి కోర్టులో హాజరుపర్చగా ప్రథమ శ్రేణి కోర్టు న్యాయమూర్తి ప్రవీణ్ రిమాండ్ విధించగా కరీంనగర్ జైలుకు తరలించామని ఎస్ఐ రమాకాంత్ సోమవారం తెలిపారు. మండలంలోని నారాయణపూర్ గ్రామ శివారులో గల చెక్ డ్యాంలో తాము చేపలు పెంచుతున్న క్రమంలో పదిర వాసులు విజయ్, భాస్కర్‌లు కరెంటు షాక్‌తో చేపలను వేటాడుతున్నారని ఎలవేణి శ్రీనివాస్ ఫిర్యాదు చేశారని పేర్కొన్నారు. ఎవరైనా విద్యుత్తు తీగలను అమర్చి జంతువులు, చేపలు వేటాడడంతో పాటు పంట పొలాల చుట్టు కరెంటు తీగలను ఏర్పాటు చేసినట్లు తమ దృష్టికి వస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

15న జేఎల్‌ఎం అభ్యర్థుల సర్టిఫికెట్ల పరిశీలన

గణేశ్‌నగర్,ఫిబ్రవరి 12: టీఎస్‌ఎన్‌పీడీసీఎల్ జిల్లా సర్కిల్ కార్యాలయంలో ఈ నెల 15న జూనియర్ లైన్‌మెన్(జేఎల్‌ఎం) అభ్యర్థుల సర్టిఫికెట్ల పరిశీలన, స్తంభం ఎక్కించే పరీక్షలను నిర్వహిస్తున్నట్లు ఎస్ఈ గంగాధర్ తెలిపారు. ఈ పరీక్ష ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం ఐదు గంటల వరకు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. జేఎల్‌ఎం అభ్యర్థులకు వారి చిరునామాలకు రిజిస్టర్డ్ పోస్ట్ ద్వారా కాల్‌లెటర్లు పంపించామన్నారు. కాల్‌లెటర్ అందనివారు కరీంనగర్ సర్కిల్ కార్యాలయంలో వాటిని పొందవచ్చన్నారు. జేఎల్‌ఎం నియామక కమిటీ ద్వారా అభ్యర్థుల ధ్రువపత్రాల పరిశీలన, పోలు ఎక్కించే పరీక్షలను పారదర్శకంగా నిర్వహిస్తామని ఆయన తెలిపారు.

యువకుడి ఆత్మహత్య

కొడిమ్యాల, ఫిబ్రవరి 12: మండలంలోని నమిళికొండ గ్రామంలో రామడుగు మండల కేంద్రానికి చెందిన బత్తిని మదన్(37)శనివారం రాత్రి ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నట్లు హెడ్‌కానిస్టేబుల్ అర్జరాజు తెలిపారు. హెడ్‌కానిస్టేబుల్ తెలిపిన వివరాల మేరకు.. మదన్ రెండు సంవత్సరాల నుంచి అత్తగారి ఊరు మండలంలోని నమిళికొండ గ్రామంలో నివసిస్తూ ఆటో నడుపుకుంటూ జీవనోపాది పొందుతున్నాడన్నారు. ఆర్థిక ఇబ్బందులతో పాటు మద్యానికి బానిసై ఇంటిలో ఎవరూ లేని సమయంలో దూలానికి ఉరి వేసుకొని ఆత్మహత్యకు పాల్పడినట్లు మృతుని భార్య మౌనిక ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు హెడ్‌కానిస్టేబుల్ తెలిపారు. మృతునికి భార్య, ఇద్దరు కూతుళ్లు ఉన్నట్లు తెలిపారు.

కాళేశ్వరంపై కాంగ్రెస్, బీఆర్‌ఎస్ దాగుడు మూతలు

- లక్ష కోట్ల ప్రజాధనాన్ని దుర్వినియోగం చేసిన కేసీఆర్ ప్రభుత్వం
- బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి, ఎంపీ బండి సంజయ్

వేములవాడ, ఫిబ్రవరి 12 : కాళేశ్వరం ప్రాజెక్టుపై కాంగ్రెస్ ప్రభుత్వం, బీఆర్ఎస్ పార్టీ దాగుడుమూతలు ఆడుతున్నాయని కరీంనగర్ పార్లమెంట్ సభ్యుడు, బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి బండి సంజయ్ అన్నారు. ప్రజాహిత యాత్రలో భాగంగా సోమవారం సాయంత్రం ఆయన వేములవాడ పట్టణంలో పాదయాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో బండి సంజయ్ మాట్లాడుతూ కాళేశ్వరం ప్రాజెక్టులో అక్రమాలపై కాంగ్రెస్ ప్రభుత్వం సిబిఐ విచారణ ఎందుకు కోరడం లేదని ప్రశ్నించారు. కాళేశ్వరం ప్రాజెక్టు పేరిట కెసిఆర్ ప్రభుత్వం లక్ష కోట్ల రూపాయల ప్రజాధనాన్ని దుర్వినియోగం చేసిందని కేసీఆర్ ఆస్తులను జప్తు చేసి కాళేశ్వరం సంబంధించిన సొమ్మును రికవరీ చేసే దమ్ము కాంగ్రెస్ ప్రభుత్వానికి ఉందా అని ఆయన సవాల్ విసిరారు. రాజీవ్ రహదారిపై సభా సంఘం మాదిరిగా డ్రామాలొద్దని, మేడిగడ్డ ప్రాజెక్టు కాంట్రాక్టు సంస్థను బెదిరించి స్వయం ప్రకటిత మేధావిగా చెప్పుకునే ఓ నాయకుడు తన కుటుంబ సభ్యులకు సబ్ కాంట్రాక్ట్ తీసుకున్నారని, క్వాలిటీ లేకుండా పనులు చేసి పిల్లర్లు వంగిపోయి ప్రమాదానికి కారకుడు ఆ స్వయం ప్రకటిత మేధావే అని అన్నారు. సదరు స్వయం ప్రకటిత మేధావిపై తక్షణమే క్రిమినల్ కేసులు పెట్టాలని, కాళేశ్వరం ప్రాజెక్టులో నాణ్యత లోపంతో పనులు చేసి ప్రజల సొమ్ములు స్వాహా చేసిన వారిపై కేసులు పెట్టి సొమ్మును రికవరీ చేసి నిజాయతీని నిరూపించుకోవాలని బండి సంజయ్ డిమాండ్ చేశారు. రెండు పార్టీలు కలిసి అసెంబ్లీని టైంపాస్ వ్యవహారంగా మారుస్తున్నారని అన్నారు.



వేములవాడలో పాదయాత్ర చేస్తున్న బండి సంజయ్

ఆటో నడిపిన బండి సంజయ్

ప్రజాహిత యాత్రలో భాగంగా కరీంనగర్ ఎంపీ బండి సంజయ్ సోమవారం సాయంత్రం వేములవాడలో ఆటో నడిపించారు. యాత్ర సందర్భంగా పలువురు ఆటో డ్రైవర్లు బండి సంజయ్‌ను కలిసి మహిళలకు ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యం కారణంగా ఉపాధి కోల్పోయి రోడ్డున పడ్డామని మొరపెట్టుకున్నారు. ఆటో డ్రైవర్ల సమస్య పరిష్కారానికి ప్రయత్నం చేస్తామని ఆటో డ్రైవర్లకు అండగా ఉంటామని బండి సంజయ్ ఈ సందర్భంగా హామీ ఇచ్చారు. బిజెపి జిల్లా అధ్యక్షుడు ప్రతాప రామకృష్ణ, నాయకుడు చెన్నమనేని వికాస్ తదితరులు పాల్గొన్నారు.

భూకబ్జా కేసులో పోలీసు కస్టడీకి శ్రీపతిరావు

కరీంనగర్ క్రైం, ఫిబ్రవరి 12: భూకబ్జా కేసులో అరెస్టు అయి కరీంనగర్ జిల్లా జైలులో ఉన్న తోట శ్రీపతిరావును కరీంనగర్ రూరల్ పోలీసులు సోమవారం కస్టడీకి తీసుకున్నారు. కరీంనగర్‌లోని వివేకానందపురి కాలనీలో అనుమాండ్ల రవీందర్‌కు చెందిన నిర్మాణంలో ఉన్న భవనం 8 పిల్లర్లను కూల్చివేసిన ఘటనకు సంబంధించిన కేసులో ఈ నెల 6న తోట శ్రీపతిరావును పోలీసులు అరెస్టు చేసి కోర్టులో హాజరుపరిచారు. జడ్జి ఆదేశాలతో 14 రోజుల రిమాండ్‌కు తరలించారు. ఈ కేసుకు సంబంధించి తోట శ్రీపతిరావును మరింత లోతుగా విచారించేందుకు అనుమతి ఇవ్వాలని పోలీసులు కోర్టులో పిటిషన్ దాఖలు చేయగా కస్టడీకి కోర్టు అనుమతించింది. సోమవారం ఉదయం 10:30 గంటల నుంచి మంగళవారం మధ్యాహ్నం 3 గంటల వరకు కస్టడీకి అనుమతించినట్లు సమాచారం. శ్రీపతిరావును కస్టడీకి తీసుకుని పోలీసులు అతడి ఇంటికి వెళ్లి సోదాలు జరిపి పలు కీలకమైన డాక్యుమెంట్లు స్వాధీనం చేసుకున్నట్లు తెలిసింది.



శ్రీపతిరావును అతని ఇంటిలో సోదాలకు తీసుకువెళ్తున్న పోలీసులు

రాష్ట్రస్థాయి ఖోఖో పోటీల్లో ఉమ్మడి జిల్లాకు ఛాంపియన్‌షిప్



ట్రోఫీని అందుకుంటున్న కరీంనగర్ ఉమ్మడి జిల్లా జట్టు

కరీంనగర్ స్పోర్ట్స్, ఫిబ్రవరి 12: తెలంగాణ రాష్ట్రస్థాయి 56వ సీనియర్ ఖోఖో పోటీల పురుషుల ఛాంపియన్‌షిప్‌ను ఉమ్మడి కరీంనగర్ జిల్లా జట్టు సాధించింది. నల్గొండ జిల్లా భువనగిరిలో ఈనెల 8 నుంచి 11వరకు తెలంగాణ ఖోఖో అసోసియేషన్ నిర్వహించిన రాష్ట్ర స్థాయి సీనియర్స్ మహిళలు, పురుషుల ఖోఖో పోటీల్లో ఉమ్మడి జిల్లా జట్టు ఛాంపియన్‌గా నిలిచింది. ఈ పోటీల్లో జిల్లా జట్టు మహబూబ్‌నగర్, ఖమ్మం, మెదక్, జట్లపై గెలుపొంది సెమి ఫైనల్స్‌లో వరంగల్ జిల్లా జట్టుతో తలపడి 5 పాయింట్ల తేడాతో ఫైనల్స్‌లో ప్రవేశించిందని జిల్లా ఖోఖో సంఘం అధ్యక్ష, కార్యదర్శులు నటరాజ్ రవి, వై మహేందర్‌రావు తెలిపారు. ఆదివారం రాత్రి పోరాపోరిగా సాగిన పురుషుల ఫైనల్స్‌లో కరీంనగర్ జట్టు రంగారెడ్డి జట్టుతో తలపడి ఒక్కపాయింట్ తేడాతో గెలుపొందిందని వారు తెలిపారు. ఈ సందర్భంగా రాష్ట్ర చాంపియన్‌గా నిలిచిన జట్టును డీవైఎస్ఓ. కీర్తి రాజవీరు, జిల్లా ఒలంపిక్ అసోసియేషన్ అధ్యక్ష,కార్యదర్శులు నందెల్లి మహిపాల్, గసిరెడ్డి జనార్దన్‌రెడ్డి ఖోఖో సంఘం ప్రతినిధులు చిట్టి తిరుపతిరెడ్డి, డాక్టర్ వేల్పుల కుమార్, ఈ నరేష్, ఎ రవీందర్, వంగపల్లి సూర్యప్రకాశ్, ఖో ఖో కోచ్‌లు వెంకటేష్, సభ్యులు ఎస్ కె మోయినోద్దిన్, మంగ సంతోష్, బి శేఖర్, కట్ట సంతోష్, రాదారాణి, రేణుక, కవిత, మానస, ఆర్ఐ కుమార్, ఎస్ఎ రమేశ్, పండుగ ఆనంద్, ప్రసాద్, శ్రీలత, జ్యోతి, జలందర్, లక్ష్మన్, నవీన్ తదితరులు అభినందించారు.

రాజన్న సేవలో ఎస్సీ, ఎస్టీ కమిషన్ ఛైర్మన్

వేములవాడ, ఫిబ్రవరి 12: వేములవాడ రాజరాజేశ్వర స్వామి వారిని రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ ఛైర్మన్ బక్కి వెంకటయ్య దర్శించుకున్నారు. సోమవారం ఆయన కుటుంబ సమేతంగా స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు సంప్రదాయం ప్రకారం ఆహ్వానం పలికి పూజల అనంతరం నాగిరెడ్డి మండపంలో ఆశీర్వచనం గావించారు. ఆలయ సూపరింటెండెంట్ తిరుపతిరావు ప్రసాదం అందజేశారు. ఆలయ ప్రొటోకాల్ సూపరింటెండెంట్ శ్రీరాములు వెంట ఉన్నారు.

యువకుడి హత్య



శ్రీధర్(ఫైల్)

వేములవాడ టౌన్, ఫిబ్రవరి 12: వేములవాడ పట్టణంలోని అర్బన్ కాలనీకి చెందిన కురుకుంట్ల శ్రీధర్ (25) అనే యువకుడు హత్యకు గురయ్యాడు. శ్రీధర్ కుటుంబ సభ్యుల వివరాల ప్రకారం.. శ్రీధర్ రాజన్న ఆలయ ధర్మగుండం వద్ద జంగమ పూజారిగా జీవనోపాధి పొందుతున్నాడు. అదే కాలనీకి చెందిన అతడి స్నేహితుడు బాబు ఆదివారం రాత్రి శ్రీధర్ ఇంటికి వచ్చి పార్టీ ఉందని తీసుకెళ్లాడు. శ్రీధర్ ద్విచక్ర వాహనంపై జర్మనీ గెస్ట్‌హౌస్ సమీపంలోని ఖాళీ ప్రాంతానికి వెళ్లారు. ఇంట్లో నుంచి వెళ్లిన శ్రీధర్ తిరిగి రాకపోవడంతో అతడి భార్య యామిని ఫోన్ చేసింది. తీయక పోవడంతో భయాందోళనకు గురైంది. తెల్లవారు జామున శ్రీధర్ హత్యకుగురయ్యాడని తెలియడంతో పోలీసులకు సమాచారం అందించారు. మృతుడికి భార్య యామిని, కుమారుడు ఉన్నారు.

సంఘటన స్థలాన్ని పరిశీలించిన ట్రైనీ ఎస్పీ

శ్రీధర్ హత్యకు గురైన సంఘటన వేములవాడ పట్టణంలో సంచలనంగా మారడంతో ట్రైనింగ్ ఎస్పీ రాహుల్‌రెడ్డి, డీఎస్పీ నాగేంద్రచారి, టౌన్ సీఐ కరుణాకర్ సంఘటన స్థలానికి చేరుకుని హత్య జరిగిన తీరును పరిశీలించారు. మృతుడి భార్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు. సంఘటన స్థలం వద్ద మృతుడి కుటుంబ సభ్యుల రోధించడంతో విషాదఛాయలు అములుకున్నాయి.

ఆత్మహత్యాయత్నం చేసిన వివాహిత చికిత్స పొందుతూ మృతి



పల్లె రమణ(ఫైల్)

ముస్తాబాద్, ఫిబ్రవరి 12: కన్న కొడుకుకు ఉద్యోగం రాలేదని ఓ తల్లి పురుగుల మందు తాగి చికిత్స పొందుగూ మృతి చెందిన సంఘటన సోమవారం జరిగింది. ఎస్‌హెచ్‌వో వెంకటరమణ తెలిపిన వివరాల ప్రకారం మండలోని తెర్లమద్ది గ్రామానికిచెందిన పల్లె రమణ (40) అనే మహిళ తన కొడుకుకు ఉద్యోగం రావట్లేదని మనస్తాపం చెంది రెండు రోజుల క్రితం పురుగుల మందు తాగింది. గమనించిన కుటుంబ సభ్యులు వెంటనే మండల కేంద్రంలోని ఓ ప్రైవేటు అసుపత్రికి తరలించారు. అక్కడి నుంచి పరిస్థితి విషమంగా ఉండడంతో ఎల్లారెడ్డిపేటకు తరలించినట్లు తెలిపారు. చికిత్స పొందుతూ పరిస్థితి విషమించడంతో సోమవారం మృతిచెందినట్లు తెలిపారు. రమణకు భర్త రవీందర్, కొడుకులు ఉన్నారు.

ఎక్సైజ్ శాఖలో సీఐలు, ఎస్ఐల బదిలీలు

కరీంనగర్ క్రైం, ఫిబ్రవరి 12: లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో దీర్ఘకాలంగా ఒకే చోట విధులు నిర్వహిస్తున్న ఉద్యోగులను బదిలీ చేయాలని కేంద్ర ఎన్నికల కమిషన్ ఆదేశాలతో ఎక్సైజ్ శాఖలో భారీ సంఖ్యలో సీఐలు, ఎస్ఐల బదిలీలు జరిగాయి. ఈ మేరకు ఎక్సైజ్ శాఖ కమిషనర్ సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. కరీంనగర్ అర్బన్ ఎక్సైజ్ సీఐ పి.తాతాజీని పరకాలకు బదిలీ చేశారు. హుజూరాబాద్ సీఐ దుర్గా భవానిని హన్మకొండకు, జగి త్యాల సీఐ ఎస్.ప్రభాకర్ రెడ్డిని వరంగల్ అర్బన్‌కు, సుల్తానాబాద్ సీఐ సీహెచ్ శామ్యూల్ ఆనంద్ రావును వరంగల్ అర్బన్ డీటీఎఫ్ సీఐగా, కరీంనగర్ రూరల్ సీఐ ఎం తిరుమలతను హన్మకొండ ఐఎంఎల్‌డిపో-1కు, రామగుండం సీఐ ఎస్ రమేష్‌ను ఖమ్మం ఎన్‌ఫోర్స్‌మెంట్‌కు, సత్తుపల్లి సీఐ వి రాజశేఖర్‌రావును వేములవాడకు బదిలీ చేశారు. వేములవాడ సీఐ జి.రామును కరీంనగర్ అర్బన్‌కు, జగిత్యాల సీఐ ఎస్ అశోక్‌కుమార్‌ను కరీంనగర్ రూరల్‌కు, లక్సెట్టిపేట సీఐ ఎస్ బాబాను తిమ్మాపూ ర్‌కు, వరంగల్ ఎన్‌ఫోర్స్‌మెంట్‌లో సీఐలుగా పనిచేస్తున్న టి శ్రీనివాసులును హుజురాబాద్‌కు, ఎం మాధవిలతను జమ్మికుంటకు, ఆసిఫాబాద్ సీఐ సయ్యద్ మోసిన్‌అలీని కరీంనగర్ ఎన్‌ఫోర్స్‌మెంట్‌కు, నేలకొండపల్లి సీఐ కె పోశెట్టిని పెద్దపల్లికి, పాల్వంచ సీఐ గరునాథ్‌ను సుల్తానాబాద్‌కు, కాగజ్‌నగర్ సీఐ సీహెచ్ మంగమ్మను రామగుండంకు బదిలీ చేశారు. ఆదిలాబాద్ ఎన్‌ఫోర్స్‌మెంట్ సీఐ మంథనికి, హరితబయో డిస్టిల్లరీ సీఐ ప్రియాంకను పెద్దపల్లికి, ఖమ్మం ఎన్‌ఫోర్స్ మెంట్ సీఐ వై సర్వేశ్వర్‌రావును జగిత్యాలకు, ఊట్నూర్ సీఐ టి మహేందర్ సింగ్‌ను ధర్మపురికి, పెద్దపల్లి డీటీఎఫ్ సీఐ వినోద్ రాథోడ్‌ను మెట్‌పల్లికి, ఇచ్చోడ సీఐ సీహెచ్ రాజమౌళిని జగిత్యాల డీటీఎఫ్‌కు, పెద్దపల్లి సీఐ ఎం శ్రీనివాస్‌ను ఎల్లారెడ్డిపేటకు, ధర్మపురి సీఐ ఏ ముత్యంను ఆదిలాబాద్ డీటీ ఎఫ్‌కు, జమ్మికుంట సీఐ ఎండీ అక్బర్ హుస్సేన్‌ను ఆదిలాబాద్ ఎన్‌ఫోర్స్‌మెంట్‌కు బదిలీ అయ్యారు. మంథని సీఐ జి గురువయ్యను మంచిర్యాలకు, తిమ్మాపూర్ సీఐ జె ఇంద్రప్ర సాద్‌ను బెల్లంపల్లికి, ఎల్లారెడ్డిపేట సీఐ ఎంపీఆర్ చంద్రశేఖర్‌ను హైదరాబాద్ ఎస్‌టీఎఫ్‌కు, మెట్‌పల్లి సీఐ ఎం రాధను తూర్పాన్ డిస్టిల్లరికి, కరీంనగర్ ఎన్‌ఫోర్స్ మెంట్ సీఐ కె విజయ్ కుమార్‌ను ప్రియాంక డిస్టిల్లరీస్‌కు, జమ్మికుంట ఎక్సైజ్ ఎస్ఐ ఎం.రమాదేవి వరంగల్ అర్బన్ డీటీఎఫ్ ఎస్ఐగా బదిలీ చేశారు. సిరిసిల్ల ఎస్ఐ కె.విజేందర్ కొత్తగూడెంకు, లక్సెట్టిపేట ఎస్ఐ ఏఆర్‌సీ జాన్ రాబర్ట్‌ను కరీంనగర్ అర్బన్, చెన్నూర్‌లో పనిచేస్తున్న కే లక్ష్మణ్‌ను కరీంనగర్ రూరల్‌కు, ఖాజీపేటలో పనిచే స్తున్న ఎం.సౌమ్యను జమ్మికుంటకు, మెట్‌పల్లి ఎస్ఐ ఎంఏ మజీద్‌ను కరీంనగర్ ఎన్‌ఫోర్స్‌మెంట్‌కు, కరీంనగర్ రూరల్ ఎస్ఐ కె.స్వప్నను జగిత్యాలకు, కరీంనగర్ అర్బన్ ఎస్ఐ కె.నరేష్‌ను ధర్మపురికి, ఎచోడ ఎస్ఐ సీహెచ్ లక్ష్మణ్‌కుమార్‌ను మెట్‌పల్లికి, ధర్మపురి ఎస్ఐ కె.శ్రీనివాస్‌ను వేములవాడకు, పెద్దపల్లి ఎస్ఐ మనీషా రాథోడ్‌ను మంచిర్యాలకు, రామగుండం ఎస్ఐ జి.శారదను బెల్లంపల్లికి, పెద్దపల్లి ఎస్ఐ బి.ప్రభాకర్‌ను జెసీపీ సాలూరకు, జగిత్యాల ఎస్ఐ ఎన్.సరితను మిర్‌దొడ్డికి, కరీంనగర్ అర్బన్ ఎస్ఐ ఆర్.రూపను హుస్నాబాద్‌కు బదిలీ చేస్తూ ఉత్తర్వులు జారీ అయ్యాయి.

బాధ్యతలు స్వీకరించిన ఎస్సైలు

కొడిమ్యాల, ఫిబ్రవరి 12 : బుగ్గారం నుంచి బదిలీపై వచ్చిన ఎస్. సందీప్ సోమవారం కొడిమ్యాల ఎస్సైగా బాధ్యతలను స్వీకరించారు. కొడిమ్యాలలో విధులు నిర్వహించిన ఎస్సై వెంకట్‌రావు జిల్లా పోలీస్ కార్యాలయానికి బదిలీ అయ్యారు.

పెగడపల్లి : పెగడపల్లి పోలీస్ సబ్ ఇన్స్పెక్టర్‌గా రామకృష్ణ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఇంతకాలం ఇక్కడ పని చేసిన సతీష్ గొల్లపల్లి మండలానికి బదిలీ కాగా, ధర్మపురి 2 ఎస్ఐగా పని చేసిన రామకృష్ణను పెగడపల్లి బదిలీ చేశారు. ఈ మేరకు సోమవారం రామకృష్ణ విధుల్లో చేరారు.

మల్లాపూర్ : మల్లాపూర్ ఎస్సైగా కిరణ్‌కుమార్ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. మల్లాపూర్‌లో విధులు నిర్వహించిన నవీన్‌కుమార్ కథలాపూర్‌కు బదిలీ కావడంతో ఆయన స్థానంలో కిరణ్‌కుమార్ బాధ్యతలు స్వీకరించారు.

మల్యాల: మల్యాల ఎస్సైగా నియమితులైన అబ్దుల్ రహమాన్ సోమవారం బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ పని చేసిన అశోక్ బదిలీ కాగ ఆయన స్థానంలో నియమితులైన నూతన ఎస్సైని పలువురు కలిసి అభినందించారు

వెల్గటూర్: వెల్గటూర్ ఎస్సైగా ఉమాసాగర్ సోమవారం పదవీ బాధ్యతలు చేపట్టారు. వెల్గటూర్ ఎస్సైగా విధులు నిర్వహించిన శ్వేత కోరుట్లకు బదిలీ అయ్యారు. ఇబ్రహీంపట్నం మండలంలో ఎస్సైగా విధులు నిర్వహించిన ఉమాశంకర్ బదిలీపై వెల్గటూర్ పోలీస్ స్టేషన్‌కు వచ్చారు.

కథలాపూర్: కథలాపూర్ ఎస్ఐగా నవీన్ సోమవారం బాధ్యతలను స్వీకరించారు. ఇక్కడ పని చేసిన కిరణ్ కుమార్ మల్లాపూర్ ఎస్ఐగా బదిలీ కాగా ఆయన స్థానం మల్లాపూర్ నుంచి కథలాపూర్ పోలీస్ స్టేషన్‌కు నవీన్ బదలీపై వచ్చారు.

గొల్లపల్లి: గొల్లపల్లి ఎస్సైగా చిర్ర సతీష్ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఇంతకాలం ఇక్కడ పని చేసిన నరేష్‌ను బదిలీ చేయగా ఆయన స్థానంలో సతీష్ బాధ్యతలు చేపట్టారు.

జాతీయ స్థాయి అథ్లెటిక్స్‌కు ఎంపిక

పెగడపల్లి, ఫిబ్రవరి 12 : మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 8వ తరగతి చదువుతున్న కంది యోగేష్ జాతీయ స్థాయి అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్‌కు ఎంపికయ్యాడు. డిసెంబరు 20న మెట్‌పల్లిలో జరిగిన పోటీలలో పాల్గొని ఉత్తమ ప్రతిభ కనబర్చి గుజరాత్ రాష్ట్రంలోని అహ్మదాబాద్‌లో ఈ నెల 16, 17, 18 తేదీలలో జరిగే అండర్ -14 విభాగంలో 19వ జాతీయస్థాయి పోటీలలో పాల్గొంటున్నాడు. జాతీయ స్థాయి అథ్లెటిక్స్ పోటీలకు ఎంపికై పోటీలలో పాల్గొనేందుకు గుజరాత్ వెళ్లేందుకు ఆర్థిక స్థోమత లేని యోగేష్‌కు తాజా మాజీ సర్పంచ్ మేరుగు శ్రీనివాస్ రెండు రోజుల క్రితం రూ. 3 వేలు అందించగా, సోమవారం పాఠశాల ఉపాధ్యాయులు రూ. 3 వేలు, ఇంగ్లీష్ ఉపాధ్యాయుడు కిషన్ రెడ్డి రూ. 2 వేలు అందించి విద్యార్థి యోగేష్‌ను శాలువాతో సత్కరించి అభినందించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు లలిత, వ్యాయామ ఉపాధ్యాయులు రమేష్, ఉపాధ్యాయులు లచ్చయ్య, కిషన్‌రెడ్డి, తిరుపతి, జ్యోతి, విజయలక్ష్మి, శ్రీనివాస్, వేణుగోపాల్, మంజుభార్గవి, అనూరాధ, శ్రీలత, మల్లేశం పాల్గొన్నారు.

మెట్‌పల్లి : జాతీయ స్థాయి అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్ పోటీలకు విద్యార్థులు ఎంపికయ్యైనట్లు అథ్లెటిక్స్ అసోసియేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఏలేటి ముత్తయ్యరెడ్డి తెలిపారు. సోమవారం విలేకరులతో మాట్లాడుతూ డిసెంబరు 20న మెట్‌పల్లి మిని అంబేద్కర్ స్టేడియంలో జరిగిన పోటీలలో పాల్గొని ఉత్తమ ప్రతిభ కనబర్చి జిల్లాలోని 13 మంది విద్యార్థులు జాతీయ స్థాయి అథ్లెటిక్స్ పోటీలకు ఎంపికయ్యారన్నారు. అహ్మదాబాద్‌లో ఈ నెల 16, 17, 18 తేదీలలో జరిగే అండర్ -14 విభాగంలో 19వ జాతీయస్థాయి పోటీలలో వారు పాల్గొంటున్నరన్నారు. పోటీలకు ఎంపికైన విద్యార్థులు గుజరాత్‌కు వెళ్లేందుకు అన్ని ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు.

ప్రభుత్వ ఉపాధ్యాయుడికి సన్మానం

మల్లాపూర్, ఫిబ్రవరి, 12 : మండలంలోని ఐలాపూర్ గ్రామంలో ప్రభుత్వ ఉపాధ్యాయుడు మంగ సంతోష్‌ను పీఆర్‌టీయూటీఎస్ నాయకులు సోమవారం సన్మానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఐలాపూర్ గ్రామంలో ఏర్పాటు చేసిన రాష్ట్ర స్థాయి శిక్షణ శిబిరానికి మండలంలోని గుండంపల్లి గ్రామంలోని ప్రాథమిక పాఠశాలలో పని చేస్తున్న మంగ సంతోష్ కన్వీనర్‌గా ఉండి గెలుపొందిన టీంకు శిక్షణ ఇవ్వడంతో రాష్ట్ర స్థాయి ఖోఖో పోటీలలో కరీంనగర్ జిల్లా టీం ప్రథమ స్థానం సాధించందన్నారు. ఖోఖో టీంను రాష్ట్ర స్థాయిలో పాల్గొనే విధంగా శిక్షణ ఇచ్చినందుకు సంతోష్‌ను శాలువతో సన్మానించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో పీఆర్‌టీయూ టీఎస్ మండల అధ్యక్షుడు శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి నవీన్‌కుమార్, శ్రీనివాస్, చంద్రప్రకాష్, రాజిరెడ్డి, శ్రీహరి, అజీమ్, రాజేష్, ఉపాధ్యాయ బృందం పాల్గొన్నారు.

నియోజకవర్గ అభివృద్ధికి నిధులు మంజూరు

కోరుట్ల ఫిబ్రవరి 12 : కోరుట్ల నియోజకవర్గంలో అభివృద్ధి పనులకు రాష్ట్ర ప్రభుత్వం రూ. 3 కోట్ల నిధులను కేటాయించినట్లు కాంగ్రెస్ సీనియర్ నాయకుడు జువ్వాడి కృష్ణారావు తెలిపారు. సోమవారం కృష్ణారావు మాట్లాడారు. నియోజకవర్గ అభివృద్ధికి నిధులు కేటాయించాలని వారం రోజుల క్రితం నియోజకవర్గ ఇన్‌చార్జి నర్సింగరావు ప్రతిపాదన మేరకు ఎంజీఎస్ఆర్ఇజీఎస్ పథకం ద్వారా రూ. 3 కోట్లు రాష్ట్ర ప్రభుత్వం మంజూరు చేసిందని తెలిపారు. ఇబ్రహీపట్నం మండలంలోని 19 పనులకు రూ. 72 లక్షలు, మల్లాపూర్ మండలంలో 27 పనులకు రూ. 97 లక్షలు, కోరుట్ల మండలం 18 పనులకు రూ. 62 లక్షలు, మెట్‌పల్లి మండలంలో 18 పనులకు రూ. 59 లక్షలు మంజూరైనట్లు తెలిపారు. నిధుల మంజూరుకు కృషి చేసిన సీఎం రేవంత్ రెడ్డి, ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి, మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు.

మహిళ కడుపు నుంచి కణతి తొలగింపు


కణతిని చూపుతున్న వైద్యురాలు స్వీతి అనూప్

కోరుట్ల ఫిబ్రవరి 12: కోరుట్ల పట్టణంలోని ఓ ప్రైవేట్ నర్సింగ్ హోంలో మహిళకు అరుదైన శస్త్ర చికిత్స నిర్వహించి 15 కిలోల కణతిని తొలగించారు. కోరుట్ల పట్టణానికి చెందిన నాజిమా కౌసర్ రెండేళ్లుగా తీవ్ర కడుపు నొప్పితో బాధపడుతూ స్త్రీ వైద్య నిపుణురాలు స్వీతి అనూప్‌రావు వద్ద వైద్య పరీక్షలు నిర్వహించుకుంది. వైద్యురాలు సిటీ స్కానింగ్‌తో కడుపులో గడ్డలతో పాటు, కణతి ఉన్నట్లు గుర్తించింది. వైద్యురాలు స్వీతి అనూప్ రావు ఆధ్వర్యంలో సర్జన్‌లు డాక్టర్ అనూప్‌రావు, డాక్టర్ నారాయణ, అనస్తీషియా వైద్యులు జగదీశ్వర్ సదరు మహిళకు సోమవారం శస్త్ర చికిత్సను నిర్వహించారు. గర్భాశయంలో ఉన్న 8 కిలోల ఫైబ్రాయిడ్ గడ్డలు, అండాశయంలో 7 కిలోల కణతిని తొలగించారు. ఈ సందర్భంగా వైద్యులు మాట్లాడుతూ మహిళల్లో ఇలాంటి కణతులు జన్యులోపంతో వస్తాయన్నారు. మహిళ సురక్షితంగా ఉందని వైద్యం అందిస్తున్నట్లు తెలిపారు. తొలగించిన గడ్డలతో పాటు, కణతిని పరీక్షల నిమిత్తం భద్రపరిచామన్నారు.

నాణ్యత ప్రమాణాలు పాటించని కాంట్రాక్టర్‌పై చర్యలు తీసుకోవాలి

రాయికల్, ఫిబ్రవరి 12: రాయికల్ పట్టణంలో నూతనంగా నిర్మిస్తున్న మున్సిపల్ భవన నిర్మాణ పనులు నాణ్యతాలోపంతో జరుగుతున్నాయని, ఇందుకు సబంధించిన కాంట్రాక్టర్‌పై చర్యలు తీసుకోవాలని బీజేపీ ఫ్లోర్ లీడ్, 8వ వార్డు కౌన్సిలర్ కల్లెడ సునీత అన్నారు. భవన నిర్మాణ పనులను సోమవారం ఆమె పరిశీలించారు. నిర్మాణంలో వాడే కంకర, సిమెంట్ సరిగా వాడటం లేదని, స్లాబ్‌కు క్యూరింగ్ కూడా చేయడం లేదని ఆరోపించారు. అధికారుల పర్యవేక్షణ లేక భవనాన్ని ఇష్టానుసారంగా కడుతున్నారని అన్నారు. అధికారులు స్పందించి కాంట్రాక్టర్‌పై చర్యలు తీసుకుని లైసెన్స్ రద్దు చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో బీజేపీ పట్టణ అధ్యక్షుడు కల్లెడ ధర్మపురి, దళిత మోర్చా అధ్యక్షుడు బన్న సంజీవ్, బీసీ సెల్ అధ్యక్షుడు ఆశన్న, పట్టణ కార్యదర్శి సామర్ల సతీష్, ఐటీ సెల్ కన్వీనర్ కిషోర్, బూత్ అధ్యక్షుడు లక్ష్మీకాంతం, ఎల్లా గౌడ్, రవి, బీజేవైఎం నాయకుడు గోపి తదితరులు పాల్గొన్నారు.

అక్కాపూర్ సంఘటనపై అసెంబ్లీలో చర్చించాలి

గంభీరావుపేట, ఫిబ్రవరి 12 : మాచారెడ్డి మండలం అక్కాపూర్‌లో దళిత మహిళను వివస్త్రను చేసి, దాడి చేసిన సంఘటనను అసెంబ్లీలో చర్చించాలని, బాధ్యులను కఠినంగా శిక్షించాలని రాష్ట్ర అంబేద్కర్ సేవా సమితి ఇన్‌చ్చాజ భూంపల్లి భీమ్‌రావు డిమాండ్ చేశారు. సోమవారం గంభీరావుపేట మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. అక్కాపూర్ సంఘటన సభ్య సమాజం తలదించుకునే విధంగా ఉందన్నారు. ప్రస్తుత అసెంబ్లీ సమావేశాల్లో అనేక సమస్యలు చర్చకు వస్తున్నాయని, ఓ దళిత మహిళను వివస్త్రను చేసిన సంఘటన చర్చకు రాకపోవడం బాధాకరమన్నారు. ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా బాధ్యులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. సమావేశంలో అంబేద్కర్ సంఘం నాయకులు ప్రశాంత్, మహేష్ తదితరులు ఉన్నారు.

వైభవంగా మార్కండేయ జయంతి


వివిధ వేషధారణలతో చిన్నారులు

జగిత్యాల టౌన్, ఫిబ్రవరి 12 : జగిత్యాల జిల్లా కేంద్రంలో సోమవారం రాత్రి మార్కండేయ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. పద్మ శాలి సంఘం ఆధ్వర్యంలో పట్టణంలో మార్కండేయుని శోభాయాత్ర నిర్వహించగా భక్తులు మంగళహారుతు లతో స్వాగతం పలికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. చిన్నారులు వివిధ వేషధారణలతో ఆకట్టుకున్నారు. బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు బోగ శ్రావణి వేడుకల్లో పాల్గొని మొక్కులు చెల్లించుకున్నారు. కార్యక్రమంలో పద్మశాలి సంఘం నాయకులు ఉన్నారు.

ధర్మపురి: ధర్మపురి క్షేత్రంలో శ్రీ మార్కండేయ స్వామి జయంతి సోమవారం ఘనంగా నిర్వహించారు. గోదావరి నదీ తీరాన గల మార్కండేయ స్వామి ఆలయంలో వేదపండితులు బొజ్జ సంపత్‌కుమార్, వేద బ్రాహ్మణుల మంత్రోచ్ఛరణల మధ్య అర్చకులు రాజు స్వామి వారలకు రుద్రాభిషేకం, ప్రత్యేక పూజలు నిర్వహించారు. పద్మశాలి మహిళలు సామూహిక కుంకుమార్చన జరిపారు. మండలంలోని జైనా, నేరెళ్ల గ్రామంల్లో మార్కండేయ జయంతి నిర్వహించారు. ఈ సందర్భంగా అన్నదానం నిర్వహించారు. కార్యక్రమంలో ధర్మపురి మున్సిపల్ చైర్‌పర్సన్ సంగి సత్యమ్మ, ఏఎంసీ చైర్మన్ అయ్యోరు రాజేష్‌కుమార్, కౌన్సిలర్ వేముల నాగలక్ష్మి, పద్మశాలి సేవా సంఘం పట్టణ అధ్యక్షులు నక్క రాజేందర్, ప్రధాన కార్యదర్శి కొంక వరప్రసాద్, ఉపాధ్యక్షులు వేముల నరేష్, గాజుల గణేష్, సంయుక్త కార్యదర్శి సామల్ల చంద్రయ్య, కొంక రాంచంద్రం, వేముల ప్రభాకర్, వేముల శంకర్, వేముల రాజేష్, వెలగం దుల సత్యనారాయణ, బుచ్చన్న, రవి, కస్తూరి శరత్, వేముల మల్లేష్, రాజన్న, పొరండ్ల చంద్రయ్య పాల్గొన్నారు.

మెట్‌పల్లి: మెట్‌పల్లి మార్కండేయ అలయంలో మార్కండేయ మహర్షి జయంతి పట్టణంలోని పద్మశాలి సంఘం సభ్యుల ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఆలయ పురోహితుడు బుక్క మఠం సంతోష్ పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పద్మశాలి పట్టణాధ్యక్షుడు ద్యావనపెల్లి రాజారాం, బీమనాథ్ సత్యనారాయణ, సంకు ఆనంద్, అన్నం నాగరాజు, గుంటుక గౌతమ్, భాస్కర్, మురళి, వాసాల నరేష్, సంఘం సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

కోరుట్ల: పట్టణంలోని పద్మశాలి సంఘంలో సోమవారం మార్కండేయ జయంతిని సంఘం నాయకులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కోటి నవదర్గ ఆలయంలో సంఘ భవనంలో ధ్వజారోహణ నిర్వహించారు. ఈ సందర్భంగా మార్కండేయ ఉత్సవ విగ్రహంతో శోభాయాత్ర నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు ఆడెపు కమల - మధు, జిందం లక్ష్మినారాయణ, రుద్ర సుజాత - శ్రీని వాస్, పెండం గణేష్, గుడ్ల మనోహర్, ముల్క ప్రసాద్, జిల్లా దనుం జయ్, గడ్డం మధు, జక్కుల ప్రసాద్ పాల్గొన్నారు.

మల్యాల: మండలంలోని మల్యాల, ముత్యంపేటలో సోమవారం మార్కండేయ జయంతి ఘనంగా నిర్వహించారు. మల్యాలలో మార్కండేయ ఆలయంలో, ముత్యంపేటలో పద్మశాలి యువజన సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన వేడుకల్లో మార్కండేయుడికి పూజలు జరిపారు. కార్యక్రమంలో మండల పద్మశాలి సంఘం అధ్యక్షుడు ముల్క మల్లయ్య, బోడ గోవర్ధన్, కట్కూరి రాజేశం, పన్నాటి మల్లేశం, చెట్‌పల్లి చక్రధర్, బాలే వంశీ, కొండబత్తిని త్రినాథ్, దేవరాజం, మునీంధర్, సంజీవ్ పాల్గొన్నారు

పెగడపల్లి: మండల కేంద్రంతో పాటు బతికెపల్లి, నందగిరి గ్రామాలలోని ఆలయాలలో పద్మశాలి సేవా సంఘాల ఆధ్వర్యంలో సోమవారం మార్కండేయ జయంతి ఘనంగా నిర్వహించారు. భక్తులకు అన్నదానం నిర్వహించారు. కార్యక్రమాలలో సంఘం నాయకులు గాజుల నర్సయ్య, గాజుల గంగా మల్లేశం, బోగ గంగాధర్, సిరిపురం మల్లేశం, బోగ గోపికృష్ణ, బోగ లక్ష్మినారాయణ, భూమయ్యఅందె వెంకటేశం, కముటం మల్లయ్య, వెంకటరాజం, రవి, వెంకటేశం పాల్గొన్నారు.

రాయికల్: పట్టణంలోని భక్త మార్కండేయ దేవాలయంలో సోమవారం పద్మశాలి సేవా సంఘం, యువజన సంఘం ఆధ్వర్యంలో మార్కండేయ జయంతి నిర్వహించారు. పద్మశాలి యువజన సంఘం అధ్యక్షుడు ఆడెపు నర్సయ్య, కార్యదర్శి కడకుంట్ల నరేష్, సామల సతీష్, లక్ష్మీ నారాయణ, రాజేశం, చిలువేరి నర్సయ్య, గూడూరి పొట్టయ్య, గంగాధర్, పూజారి మల్లిఖార్జున్ పాల్గొన్నారు.

గొల్లపల్లి: మండలంలోని పలు గ్రామాల్లో మార్కండేయ మహర్షి ఆలయాల్లో కుంకుమ పూజలు, అభిషేకాలు నిర్వహించారు. చెందోళి, రాపల్లె, రాఘవపట్నం గ్రామాల్లో మార్కండేయ జయంత్యుత్సవాలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అధ్యక్షుడు చౌట్‌పెల్లి తిరుపతి, అలిశెట్టి రవీందర్, అలిశెట్టి రమేష్, కొక్కుల భూమయ్య, స్వర్గం లక్ష్మీనారాయణ, ఆసం గంగాధర్, కొప్పు గంగాధర్, తిరుపతి, అందె తిరుపతి, అందె లక్ష్మణ్, అంకం లక్ష్మీనారాయణ, అంకం భూమయ్య, సామల వీరస్వామి, గూడూరి రాజన్న, ధర్మపురి మల్లేశం, బట్టల తిరుపతి, ఆడెపు నరేష్, అంకం సురేష్, జనార్ధన్, మారుతి, ఎనుగందుల శంకర్, జడల సమ్మయ్య, అనుమల్ల వెంకటేశం, అంకం రాజన్న, గుండేటి సత్తన్న, ఆడెపు సంజీవ్ పాల్గొన్నారు.

మల్లాపూర్: మండలంలోని మల్లాపూర్ పద్మశాలి సంఘ భవనంలో సభ్యులు మార్కండేయ చిత్రపటానికి పూలమాలలు వేసి జయంతి నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సంఘం అధ్యక్షుడు అయ్యారి దశరథం, కుల సభ్యులు పాల్గొన్నారు.


కోరుట్లలో జయంత్యుత్సవంలో పాల్గొన్న పద్మశాలి సంఘ నేతలు

విద్యార్థులు అధైర్యపడవద్దు

కలెక్టర్ షేక్ యాస్మిన్ భాషా


మాట్లాడుతున్న కలెక్టర్ షేక్ యాస్మిన్ భాషా

జగిత్యాల, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): వెల్ఫేర్ హాస్టల్స్, రెసిడెన్షియల్ స్కూల్ విద్యార్థులు అధైర్యపడకుండా ప్రోత్సహించాలని కలెక్టర్ షేక్ యాస్మిన్ భాషా అధికారులను ఆదేశించారు. సోమవారం పట్టణంలోని సమీకృత కలెక్టరేట్ కార్యాలయంలో గల ఆడిటోరియంలో వివిధ ప్రభుత్వ శాఖల అధికారులతో అభివృద్ధి, సంక్షేమంపై సమీక్ష సమావేశం నిర్వహించారు. వెల్ఫేర్ హాస్టల్స్, రెసిడెన్షియల్ స్కూల్స్ ఇన్‌చార్జిలతో వాట్సాప్ గ్రూప్ క్రియేట్ చేశామని, కానీ కొంత మంది అధికారులు మాత్రమే తమకు రిపోర్ట్ ఇస్తున్నారని, మిగతా అధికారుల నుంచి ఎటువంటి రిపోర్ట్ రావడం లేదన్నారు. ప్రతీ మంగళవారం స్పెషల్ ఆఫీసర్లు వెల్ఫేర్ హాస్టల్స్, రెసిడెన్షియల్ స్కూల్స్‌ను తప్పకుండా సందర్శించాలని ఆదేశించారు. చదువులో వెనుకబడ్డ విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ వహించాలన్నారు. వ్యక్తి గత పరిశుభ్రత, మోటివేషన్ తరగతులు నిర్వహించేలా చూడాలన్నారు. చిన్న చిన్న విషయాలకు విద్యార్థులు చాలా సెన్సిటీవ్ అయి వారి ప్రాణాలు తీసుకుంటున్నారని, అలా జరగకుండా హాస్టల్స్‌లో పిల్లలకు ఏదైనా సమస్య ఉంటే వార్డెన్లతో షేర్ చేసుకోవాలని, విద్యార్థులకు ఫ్రీ కౌన్సెలింగ్ ఇప్పించాలని సూచించారు. కార్యక్రమంలో జిల్లా స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ దివాకర, వివిధ శాఖల జిల్లా అధికారులు, కలెక్టరేట్ కార్యాలయ సూపరింటెండెంట్లు పాల్గొన్నారు.

ఈనెల 21 వరకు దూరవిద్య పరీక్ష ఫీజు గడువు

మల్లాపూర్, ఫిబ్రవరి, 12 : మండలంలోని సిరిపూర్ గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల్లో చదువుతున్న విద్యార్థులు, ఫెయిల్ అయిన వారు వార్షిక పరీక్షల ఫీజు ఈనెల 21లోపు చెల్లించాలని కోఆర్డినేటర్ మద్దెల శంకర్ తెలిపారు. సోమవారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ దూర విద్య కోసం 2023-24 సంవత్సరానికి పాఠశాలలో ప్రవేశం పొందిన పదో తరగతి, ఇంటర్మీడియెట్ విద్యార్థులు, ఫెయిల్ అయిన వారు పరీక్ష ఫీజు చెల్లింపు ప్రక్రియ ఈనెల 12 నుంచి ప్రారంభమైందన్నారు. పరీక్షల కోసం ఫీజు చెలింపునకు తుడి గడువు ఈనెల 21వ తేదీ వరకు ఉందని, ఆలస్య రుసుం రూ. 25తో ఈనెల 22 నుంచి 27 వరకు, మరితం ఆలస్యం అయిన వారు మార్చి 4 లోపు రూ. 50తో మీసేవ లేదా ఆన్‌లైన్‌లో చెల్లించవొచ్చన్నారు. దూర విద్య పరీక్షలు ఏప్రిల్, మే నెలలలో జరగవచ్చని, వివరాల కోసం 9440220340 నంబర్‌ను సంప్రదించాలని తెలిపారు.

ఇద్దరు ఎస్సైల బదిలీ

జగిత్యాల టౌన్, ఫిబ్రవరి 12 : జగిత్యాల జిల్లాలో పని చేస్తున్న ఇద్దరు ఎస్సైలను బదిలీ చేస్తూ ఎస్పీ సన్ ప్రీత్ సింగ్ సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. వెల్గటూర్ ఎస్సైగా పని చేస్తున్న అనీల్‌ను ఇబ్రహీంపట్నం పోలీస్ స్టేషన్‌కు, ఇబ్రహీంపట్నం ఎస్సైగా పని చేస్తున్న ఉమాసాగర్‌ను వెల్గటూర్ పోలీస్ స్టేషన్‌కు బదిలీ చేశారు. ఈ ఉత్తర్వులు వెంటనే అమలులోకి వస్తాయని పేర్కొన్నారు.

మోదీ నేతృత్వంలో సాధించిన విజయాలను వివరించాలి

బీజేపీ పట్టణాధ్యక్షుడు బోడ్ల రమేష్


ఇంటింటికి కరపత్రాలను అందజేస్తున్న బీజేపీ నాయకులు

మెట్‌పల్లి, ఫిబ్రవరి, 12 : ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నేతృత్వంలో కేంద్ర ప్రభుత్వం సాధించిన విజయాలు, ప్రవేశపెటి అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు గావ్ చలో బస్తీ చేలో అభియాన్ కార్యక్రమంలో భాగంగా ప్రజలకు వివరించాలని బీజేపీ పట్టణ అధ్యక్షుడు బోడ్ల రమేష్ అన్నారు. సోమవారం పట్టణంలోని 18వ వార్డుల్లో నిర్వహించిన కార్యక్రమంలో భాగంగా గడపగడపకూ తిరిగి ప్రజలకు కరపత్రాలను అందజేసి వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేదల సంక్షేమం మహిళా సాధికారిత అంతర్గత భావ్య భద్రత సంస్కృతి పునరుద్ధరణ, విదేశాల్లో భారత దేశ గౌరవాన్ని పెంచి అన్ని రంగాల్లో దేశాన్ని బీజేపీ ప్రభుత్వంలో కేంద్రంలో ప్రధాన నరేంద్ర మోదీ నేతృత్వంలో అభివృద్ధి చేశారన్నారు. పదేళ్లలో బీజేపీ ప్రభుత్వం పాలనలో ప్రపంచ దేశాల్లో భారతదేశ ఖ్యాతిని పెంచిన గొప్ప నాయకుడని కొనియాడారు. కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న ఉజ్వల గ్యాస్ కనెక్షన్, గరీబ్ కళ్యాణ యోజన, ఆయుష్మాన్ భారత్, విశ్వకర్మ ముద్ర లోన్స్, జన్‌ధన్ యోజన, పీఎం కిసాన్, సన్ నిధితో పాటు తదితర పథకాలు అర్హులైన వారు సద్వినియోగం చేసుకునేలా ప్రజలకు తెలియజేయాలన్నారు. పీఎం నరేంద్రమోదీ నేతృత్వంలో సాధించిన విజయాలు, సంక్షేమ పథకాలు, అభివృద్ధిని బూత్ స్థాయి కమిటీ సభ్యులు ప్రతి ఇంటికి వివరించాలని పిలుపు నిచ్చారు. ఈ కార్యక్రమంలో నాయకులు చెట్లపల్లి సుఖేందర్‌గౌడ్, చెట్లపల్లి మీనా, ఎలిమి ప్రదీప్, జుంగుల అనిల్, మాదాస్తు సాయిప్రసాద్, శంకరయ్య పాల్గొన్నారు.

మరోమారు ప్రధానిగా మోదీని బలపరచండి

కోరుట్ల : మరోమారు దేశ ప్రధానిగా నరేంద్ర మోదిని బల పరచండని బీజేపీ నాయకులు కోరారు. సోమవారం పట్టణంలోని 11, 12వ వార్డుల్లో చలో గావ్ చలో బస్తి కార్యక్రమంలో భాగంగా కేంద్ర ప్రభుత్వ ప్రవేశ పెట్టిన పథకాలను వార్డు ప్రజలకు వివరిస్తూ రూపొందించిన కరపత్రాన్ని పంపిణీ చేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడారు. కేంద్రంలో నరేంద్ర మోదీ ప్రభుత్వం దేశాన్ని అన్ని రంగాలలో అభివృద్ధి పథంలో నడిపిస్తున్నాడని అన్నారు. ఈ కార్యక్రమంలో వార్డు కౌన్సిలర్ మ్యాడవేణి నరేష్, జిల్లా అధికార ప్రతినిది కస్తూరి లక్ష్మినారాయణ బీజేపీ నాయకులు సుదవేణి మహేష్, మ్యాకల గణేష్ పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం

పెగడపల్లి: పీఎంపీ, ఆర్ఎంపీ పెగడపల్లి మండల అధ్యక్షుడిగా కుసుమ శంకర్ ఎన్నికయ్యారు. మండల కేంద్రంలోని ఆ సంఘం భవనంలో సోమవారం ఎన్నికలు నిర్వహించారు. ప్రధాన కార్యదర్శిగా గాజుల గంగాధర్, రమేష్‌లు పోటీ పడగా ఇరువురికి సమాన ఓట్లు పోలవడంతో డ్రా పద్ధతిన గంగాధర్ గెలిచినట్లు ప్రకటించారు. కోశాధికారిగా కుంటాల శ్రీనివాస్ ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు సంఘం నాయకులు తెలిపారు.

కొడిమ్యాల: తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ మెడికల్ ల్యాబ్ టెక్నీషియన్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడిగా రొడ్డ రాములును ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు అసోసియేషన్ వ్యవస్థాపకుడు, రాష్ట ప్రధాన కార్యదర్శి మంచాల రవీందర్ సోమవారం తెలిపారు. కార్యదర్శిగా సునంద్‌రావు, కోశాధికారిగా వినయ్, కార్యనిర్వహణ కార్యదర్శిగా శ్రీ సాయి క్రిష్ణ, ఉపాధ్యక్షుడిగా ఉమాదేవి, సంతోష్, సంయుక్త కార్యదర్శులుగా సతీష్‌కుమార్, సామ్రాట్, సలహాదారులుగా చిన్న రాజయ్య, జలజ, కార్యవర్గ సభ్యులుగా శ్రీధర్, విజయలక్ష్మి, కల్పన, రాజమణి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.

కథలాపూర్: మండలంలోని భూషన్‌రావుపేట గ్రామంలో సోమవారం గద్దర్ విగ్రహ నిర్మాణానికి భూమి పూజ చేశారు. గ్రామంలో సామాజిక తెలంగాణ ధూంధాం కన్వీనర్ మారంపల్లి రవీంధర్, ధూంధాం రూపకర్త గద్దర్ జయంత్యుత్సవాల పర్యవేక్షకుడు అంతడుపుల నాగరాజులతో పాటు భూమి పూజను చేశారు. గద్దర్ జీవితం ప్రతి ఒక్కరికి ఆదర్శమన్నారు. ఈ కార్యక్రమంలో బీసీ సంక్షేమ సంఘ జిల్లా అధ్యక్షుడు యాగాండ్ల రమేష్, బుజగం గంగాధర్, షైన శ్రీధర్, మాజీ సర్పంచ్ స్వామి దళిత సంఘ నాయకులు పాల్గొన్నారు.

భీమారం: మండల కేంద్రంలో వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ చొరవతో ఎన్ఆర్ఈజీఎస్ నిధులు రూ.5 లక్షలతో నిర్మించనున్న సీసీ రోడ్డు పనులను గ్రామ కాంగ్రెస్ నాయకులు సోమవారం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నా యకులు కల్లెడ వినయ్, బక్కూరి నరేష్, చెక్కపెల్లి సంజీవ్, కొత్తపెల్లి రాజేందర్, దురిశెట్టి భూమాచారి, రాజబోస్, అమీర్, రవిగౌడ్, దురిశెట్టి రవితేజ, ఆరె నర్సయ్య, చెక్కపెల్లి శంకర్ పాల్గొన్నారు.

కొడిమ్యాల: వంద రోజుల పనిలలో కూలీలు అధిక సంఖ్యలో పాల్గొని ఉపాధి పొందాలని ఏపీవో సతీష్ కోరారు. మండలంలోని చెప్యాల గ్రామంలో సోమవారం ఆయన కూలీలతో మాట్లాడుతూ మహాత్మగాంధీ జాతీయ గ్రామీన ఉపాధిహామీ పథకంలో బాగంగా గ్రామాల్లో అడవిలో గుట్టలకు కందకాల తవ్వకం, చెరువుల, కాల్వల పూడిక తీత పనులకు ఉపాధీ కూలీలు అధిక సంఖ్యలో హాజరుకావాలన్నారు. మండలంలోని వివిధ గ్రామాల్లో 7వేల 29 ఆక్టీవ్ జాబ్ కార్డులు ఉండగా 11వేల 72 మంది ఉపాధి కూలీలున్నారన్నారు. వీరిలో 100 రోజుల పని పూర్తి చేసుకోవడానికి ఎక్కువగా ఉపాధి పనులకు హాజరు కావాలని ఏపీవో కోరారు. పని కోసం కార్యదర్శికి, ఫీల్డ్ అసిస్టెంట్లకు దరఖాస్తు చేసుకోవాలన్నారు.

జగిత్యాల రూరల్: మండలంలోని లక్ష్మీపూర్ ఊర చెరువులో ధర్మారం గ్రామానికి చెందిన శంకర్ అనే వ్యక్తి మట్టిపోసి ఆక్రమించుటకు యత్నించినట్లు జగిత్యాల రూరల్ ఎస్సై సధాకర్ తెలిపారు. ఇరిగేషన్ ఎగ్జిక్యూటీవ్ ఇంజనీర్ ఏ.హెచ్ ఖాన్ ఫిర్యాదు మేరకు శంకర్ పై కేసు నమోదు చేసినట్లు ఎస్సై సధాకర్ తెలిపారు.

గృహజ్యోతి దరఖాస్తుల పరిశీలన

కొడిమ్యాల, ఫిబ్రవరి 12 : మండలంలోని వివిద గ్రామాల్లో గత ఆరు రోజులుగా ప్రజాపాలనలో ప్రజల నుండి వచ్చిన గృహజ్యోతి దరఖాస్తులను విద్యుత్ శాఖ అధికారులు, సిబ్బంది పరిశీలిస్తున్నారు. ఇంటింటికి తిరుగుతూ దరఖాస్తు దారుల వివరాలను నేరుగా తెలుసుకొని ఆన్‌లైన్ నమోదు చేస్తున్నారు. ఈ పరిశీలనలో కొడిమ్యాల, పూడూర్ ఏఈఈలు రఘునాథ్, శ్రీనాథ్, లైన్ ఇన్స్‌పెక్టర్లు రామయ్య, రవిశంకర్, లైన్‌మెన్లు వేణు, రాజనర్సయ్య, లైన్‌మెన్లు నరేష్, రమేష్, శ్రీనివాస్, హరీష్ సిబ్బంది పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి చిత్రలేఖనం పోటీలకు విద్యార్థిని ఎంపిక

రాయికల్, ఫిబ్రవరి 12: రాయికల్ బాలికల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 9వ తరగతి చదువుతున్న ఎం.హంపి రాష్ట్ర స్థాయి చిత్రలేఖనం పోటీలకు ఎంపికైంది. జాతీయ సైన్స్ దినోత్సవాన్ని పురస్కరించుకుని శనివారం జగిత్యాలలో నిర్వహించిన జిల్లా స్థాయి చిత్రలేఖనం పోటీల్లో ప్రతిభ కనబరిచి రాష్ట్ర స్థాయికి ఎంపికైనట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థిని ప్రధానోపాధ్యాయుడు శ్రీపతి రాఘవులు, ఉపాధ్యాయులు పొన్నం రమేష్, రవీందర్, మల్లేశం, గంగజమున, సత్యానారాయణ, వనజ, జ్యోతి, నాగరాజు, శ్రావణ్, సుజాత పాల్గొన్నారు.

నల్లబ్యాడ్జీలతో గురుకులం ఉపాధ్యాయినుల నిరసన

ఎల్లారెడ్డిపేట, ఫిబ్రవరి 12: గురుకులంలో విధులు నిర్వహిస్తున్న ఉపాధ్యాయులకు పదోన్నతులు, బదిలీలు చేపట్టి నూతన నియామకాల ప్రక్రియను నిర్వహించాలని డిమాండ్ చేస్తూ గురుకులాల జేఏసీ పిలుపు మేరకు ఎల్లారెడ్డిపేట మండలం దుమాల ఏకలవ్య గురుకులం ఉపాధ్యాయినులు సోమవారం నల్లబ్యాడ్జీలు ధరించి పాఠశాల ఎదుట నిరసన వ్యక్తం చేశారు. సీఎం రేవంత్‌రెడ్డి స్పందించి తమ సమస్యలను పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో ఉపాధ్యాయినులు రోజారాణి, మమత, మనీష, శ్రీలత, సరిత, సంధ్య, రజిత, శాలిని, మాధవి, స్రవంతి తదితరులు పాల్గొన్నారు.

'విద్యార్థుల్లో సామర్థ్యాలు పెంపొందించాలి'

రాయికల్, ఫిబ్రవరి 12: విద్యార్థుల్లో తగిన అభ్యసన సామర్థ్యాలు పెంపొందించాలని జిల్లా సెక్టోరియల్ అధికారి కొక్కు రాజేష్ అన్నారు. మండలంలోని భూపతిపూర్ ఉన్నత పాఠశాలలో సోమవారం పాఠశాల సముదాయ సమావేశాన్ని సందర్శించారు. ఆయన మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం అందించిన పాఠ్య ప్రణాళికలను, అభ్యాస దీపికలను ఉపాధ్యాయులు సక్రమంగా ఉపయోగించుకుని విద్యార్థుల్లో స్థాయికి తగిన అభ్యసన సామర్థ్యాలు పెంపొందించాలని కోరారు. రేపటి తరాన్ని నిర్మించే జాతి నిర్మాతలు ఉపాధ్యాయులు అని, వారు తమ వృత్తి పట్ల నిబద్ధత కలిగి ఉండాలన్నారు.

ప్రణాళికాబద్ధంగా బోధిస్తే ఆశించిన ఫలితాల సాధన సులభమే అని, విద్యార్థుల మనసుపై చెరగని ముద్ర వేసేలా పాఠ్యాంశాలు బోధించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల సముదాయ ప్రధానోపా ధ్యాయురాలు రమణి, రిసోర్స్ పర్సన్‌లు రాపర్తి శ్రీధర్, మాచర్ల మహేష్, సీఆర్‌పీ రాజేష్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ప్రభుత్వ భూమిని పరిరక్షించాలి


కలెక్టరేట్‌కు తరలివచ్చిన లక్ష్మీపూర్ గ్రామస్థులు

సిరిసిల్ల కలెక్టరేట్, ఫిబ్రవరి 12: తంగళ్ల పల్లి మండల లక్ష్మీపూర్‌లో ప్రభుత్వ భూమి అన్యాకాంతం అవుతోందని, పరిరక్షించి గ్రామ అవసరాల కోసం కేటాయించాలని లక్ష్మీపూర్ గ్రామస్థులు కోరారు. సోమవారం కలెక్టరేట్‌లో కలెక్టర్ అనురాగ్ జయంతికి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా గ్రామస్థులు మాట్లాడుతూ గ్రామంలో రైల్వేలైన్‌ల నిర్మాణంలో డంపింగ్‌యార్డు, వర్మి కంపోస్ట్ షెడ్, హరితహారంలో నాటిన మొక్కలు పోతున్నాయని వివరించారు. గ్రామానికి ఆనుకొని ఉన్న ప్రభుత్వ భూమిని గ్రామ అవసరాల కోసం కేటాయించాలన్నారు. కాకులబోరు వద్ద ప్రభుత్వ భూమి దాదాపు 20 ఎకరాలు కబ్జా గురవుతోందని, రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం వివరించారు. కార్యక్రమంలో రాజయ్య, మల్లయ్య, రాజలింగం, రాంబాబు, మల్లేశం, రమేష్ పాల్గొన్నారు.